

మూడు స్థానాలకు 11 నామినేషన్ల దాఖలు

బెంగళూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మూడు శాసనసభ స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికల్లో బుధవారం 11 మంది అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేశారు. చన్నపట్టణ నుంచి ఐదుగురు నామినేషన్‌లు వేశారు. శిగ్గావి నుంచి ముగ్గురు మూడు వేశారు. సండూరు నుంచి ఇద్దరు పురుషులతో పాటు ఓ మహిళ కలిపి మూడు నామినేషన్‌లు వేశారు. ఇప్పటి వరకూ 19 మంది అభ్యర్థులు 31 సెట్‌ల నామినేషన్‌లు దాఖలు చేశారు. చన్నపట్టణ నుంచి 9 మంది 14 సెట్‌ల నామినేషన్‌లు వేయగా సండూరు నుంచి నలుగురు నాలుగు సెట్‌ల నామినేషన్‌లు, శిగ్గావి నుంచి ఆరుగురు 13 సెట్‌ల నామినేషన్లు వేశారు.

న్యూస్ బాక్స్

26న కంబళ జరగదు

● హైకోర్టుకు కంబళ సమితి వినతి

బెంగళూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్యాలెస్ గ్రౌండ్స్‌లో ఈనెల 26న కంబళ (బురదలో దున్నపోతుల పరుగు) పోటీలు జరగవని బెంగళూరు కంబళ కమిటీ హైకోర్టుకు విన్నవించింది. బెంగళూరులో కంబళ పోటీలు నిర్వహించేందుకు అనుమతులు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వానికి సూచించాలని పీపుల్ ఫర్ ది ఎథికల్ ట్రీట్‌మెంట్ అనిమల్స్ (పెటా) ప్రతినిధులు పిల్ దాఖలు చేశారు. విచారణలు చేపట్టిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ అంజారియా నేతృత్వంలోన ధర్మాసనం ఇరువర్గాల వాదనలు ఆలకించింది. కంబళ కమిటీ తరపున పాల్గొన్న న్యాయవాదులు బెంగళూరులో ఈనెల 26న కంబళ పోటీలు నిర్వహించడం లేదని వివరించారు. ఈమేరకు పెటా తరపు న్యాయవాదులు కంబళ పోటీలను ఉడుపి, దక్షిణకన్నడ జిల్లాలు మినహా ఎక్కడా నిర్వహించేందుకు అనుమతులు లేవని వివరించారు. ఈమేరకు కేసును నవంబరు 5కు వాయిదా వేశారు.

జేడీఎస్‌కు షాక్..!

● కాంగ్రెస్ గూటికి సీపీ యోగేశ్వర్

● ఫలించిన డీకే శివకుమార్ మంత్రాంగం

● నేడు నామినేషన్

బెంగళూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాలలో ఏడాదిన్నరకాలంగా సాగుతున్న జేడీఎస్, కాంగ్రెస్ పార్టీ కీలక నేతలు కుమారస్వామి వర్సెస్ డీకే శివకుమార్ ఎత్తుగడలకు భారీ మలుపు తిరిగింది. చన్నపట్టణ నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా, మాజీ మంత్రిగా, ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగిన సీపీ యోగేశ్వర్‌ను కాంగ్రెస్‌లోకి రప్పించుకోవడం ద్వారా జేడీఎస్ పార్టీకి గట్టిషాక్ ఇచ్చారు. రామనగర జిల్లాలోని చన్నపట్టణ నియోజకవర్గం దశాబ్దాలుగా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండగా ఆ తర్వాత సీపీ యోగేశ్వర్ ఇండిపెండెంట్‌గా, కాంగ్రెస్ నుంచి ఆ తర్వాత బీజేపీలోకి చేరారు. కాంగ్రెస్ నుంచి పలుమార్లు ఆయన ఎమ్మెల్యేగా వ్యవహరించారు. మారిన రాజకీయ సమీకరణలతో బీజేపీలోకి వెళ్లారు. ఇదే సందర్భంలోనే జేడీఎస్ పార్టీ తమకు అనుకూలంగా నియోజకవర్గాన్ని మలచుకుంది. ఇలా వరుసగా కుమారస్వామి చన్నపట్టణ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందుతూ వచ్చారు. ఇక్కడ నుంచి ఎమ్మెల్యేగా ఉంటూనే ముఖ్యమంత్రిగా కూడా వ్యవహరించారు. నియోజకవర్గానికి ప్రాధాన్యం ఇస్తూ వస్తుండడంతో ఆయనకు కంచుకోటగా మారింది. 2023 శాసనసభ ఎన్నికల్లో కుమారస్వామి చన్నపట్టణ నుంచి గెలుపొందారు. దానికి అనుబంధంగా ఉండే రామనగరకు సిట్టింగ్ ఎమ్మెల్యేగా కుమారస్వామి భార్య అనితా వ్యవహరించారు. అదే స్థానం నుంచి నిఖిల్‌ను బరిలోకి దించగా ఓటమి చెందారు. ఇలా రామనగర జిల్లాలో మరో నియోజకవర్గమైన కనకపుర డీకే శివకుమార్‌కు సొంతం కావడంతో ఆయనకు ఎదురులేదు. రామనగర జిల్లాలో జేడీఎస్ ప్రాబల్యం ఉన్నందునే బెంగళూరు గ్రామీణ లోక్‌సభ ఎన్నికల్లో కుమారస్వామి బావ డాక్టర్ సీఎన్ మంజునాథ్‌ను బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా బరిలోకి దింపి డీకే శివకుమార్ తమ్ముడు, సిట్టింగ్ ఎంపీ డీకే సురేశ్‌ను చిత్తుగా ఓడించారు. అప్పటి నుంచి కుమారస్వామి కుటుంబంపై రాజకీయంగా దెబ్బతీసేందుకు డీకే ఎత్తుగడలు వేస్తూ వస్తున్నారు. చన్నపట్టణ నుంచి సీపీ యోగేశ్వర్ బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు ప్రయత్నించారు. అయితే కుమారస్వామి నా సొంత నియోజకవర్గాన్ని వదులుకోలేనంటూ మెలిక పెట్టారు. చివరిక్షణం దాకా యోగేశ్వర్ టిక్కెట్ కోసం కసరత్తు సాగిస్తూనే ఉన్నారు. ఈలోగా బీజేపీ సీనియర్ నేత యడియూరప్ప చన్నపట్టణ స్థానం జేడీఎస్‌కు చెందినదని కుమారస్వామి నిర్ణయమే అంతిమమని రగులుతున్న వ్యాజ్యానికి మరింత ఆజ్యం పోశారు. దీంతో టిక్కెట్ దక్కదని తీర్మానించుకున్న యోగేశ్వర్ రాత్రికి రాత్రి పావులు కదిపారు. సోమవారం ఎమ్మెల్సీ పదవికి, బీజేపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. మంగళవారం రాత్రి పొద్దుపోయాక డీకే శివకుమార్‌తో భేటీ అయ్యారు. ఇలా బుధవారం ఉదయానికి ఒక్కసారిగా సీన్ మారింది. డీసీఎం డీకే శివకుమార్ నివాసానికి చేరుకున్న సీపీ యోగేశ్వర్ కాసేపు చర్చలు జరిపాక నేరుగా ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో భేటీ అయ్యారు. పార్టీలో చేరే విషయమై ఖరారు చేసుకున్నారు. ఆ తర్వాత కేపీసీసీలో పార్టీ కండువా కప్పుకొని ప్రాథమిక సభ్యత్వాన్ని స్వీకరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నంలోగా ప్రక్రియ పూర్తయ్యింది.



సీపీ యోగేశ్వర్‌ను పార్టీలోకి స్వాగతిస్తున్న డీకే శివకుమార్

ఇంతకంటే కిందకు దిగలేను: కుమారస్వామి



కార్యకర్తల భావనలకు అనుగుణంగానే టిక్కెట్ కేటాయిస్తామని అందుకోసమే భూమిని తాకేంతవరకు వంగానని అంతకంటే కిందకు వెళ్లలేనని, నా సహనానికి హద్దు ఉందని కుమారస్వామి అభిప్రాయపడ్డారు. బుధవారం చన్నపట్టణలో జేడీఎస్ పార్టీ కీలక సమావేశం జరిగింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు దేవేగౌడ, కుమారస్వామి, నిఖిల్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ఎవరెన్ని రాజకీయాలు చేసినా భయపడేది లేదని, ఉప ఎన్నికల్లో ఎన్నోసార్లు గెలుపొందానన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమిత్‌షాలతో ఉండే సంబంధాలకోసం కొనసాగుతున్నానన్నారు. ఎవరు పార్టీ ఫిరాయించినా భయపడేది లేదన్నారు. కాగా సభలో నిఖిల్‌కు టిక్కెట్ ఇవ్వాలంటూ కార్యకర్తలు నినాదాలు చేయడంతో సగంలోనే కుమారస్వామి ప్రసంగం ముగించాల్సి వచ్చింది.

నేడు కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్

చన్నపట్టణ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సీపీ యోగేశ్వర్ గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇదే విషయాన్ని కేపీసీసీ అధ్యక్షుడు, డీసీఎం డీకే శివకుమార్ బెంగళూరులో ప్రకటించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జాబితాను విడుదల చేస్తారన్నారు.

రామనగరలో ఉనికి కోల్పోతున్న జేడీఎస్

రామనగర జిల్లాలో కొన్నేళ్లకాలంగా జేడీఎస్‌కు పట్టు ఉండేది. ఒకప్పుడు కనకపుర మినహా మిగిలిన మూడు నియోజకవర్గాలలోనూ పార్టీ ఎమ్మెల్యేలు ఉండేవారు. 2023కు ముందు చన్నపట్టణ, రామనగర నియోజకవర్గాలలో ఎమ్మెల్యేలుగా కుమారస్వామి, భార్య అనితా కొనసాగారు. ఆ తర్వాత ఎన్నికల్లో అనితాకు బదులుగా నిఖిల్ పోటీ చేసి ఓడిపోయారు. దీంతో కుమారస్వామి ఒక్కరే జిల్లాలో ఎమ్మెల్యే అయ్యారు. మాగడి నుంచి బాలకృష్ణ వరుసగా గెలుపొందుతూ వస్తున్నారు. ప్రస్తుతం చన్నపట్టణ నుంచి యోగేశ్వర్ కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తే జేడీఎస్ గెలవడం అంతసులువు కాదు. ఇప్పటికే డీకే శివకుమార్ నియోజకవర్గానికి వందల కోట్లు గ్రాంట్లు ప్రకటించారు. జేడీఎస్‌కు చెందిన 13మంది కార్పొరేటర్‌లను కాంగ్రెస్‌లోకి లాగేసుకున్నారు. మరోవైపు గ్రామాలవారీగా జేడీఎస్‌లో కీలకులందరినీ పార్టీలోకి చేర్చుకునేందుకు ప్రణాళికాబద్ధంగా రెండు నెలలుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే చన్నపట్టణ కాంగ్రెస్‌కు బలం అయ్యింది. ప్రస్తుతం సీపీ యోగేశ్వర్ అభ్యర్థి అయితే ఆయన అనుచరులు, అభిమానులు కూడా కలసి పనిచేస్తారు. ఇలా జేడీఎస్‌కు షాక్ తగిలినట్టయ్యింది. ఇప్పటికే హాసన్ ఎంపీని కోల్పోయారు. మరోవైపు రామనగర జిల్లాలోనూ ఎదురుదెబ్బ తగిలింది.

100 శాతం ఉత్తీర్ణతకు... ప్రైవేటు కుట్ర..!

● విద్యలో వెనుకబడితే వారిపై వేటే

● ప్రైవేటుగా రాయిస్తామని బెదిరిస్తున్న యాజమాన్యాలు

● దృష్టిసారించని విద్యాశాఖ అధికారులు



బెంగళూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతటా ప్రైవేట్ విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా పెరిగిపోతున్నాయి. ఒక పాఠశాలకు అనుమతి తీసుకుని నాలుగైదు శాఖలు నడిపే వారు కొందరైతే, తమ పాఠశాలలో ఫెయిల్యూర్ అనేది లేదని ప్రచారం చేసుకుని ఏటా ఫీజులు పెంచే సంస్థలు మరికొన్ని ఉన్నాయి. ప్రచారంలో ప్రాధాన్యం ఉండాలంటే 100 శాతం ఉత్తీర్ణత ముఖ్యమని ప్రైవేట్ విద్యాసంస్థలు కుట్ర పన్నాయి. అందుకు అనుగుణంగానే ఎస్‌ఎస్‌ఎల్‌సీలో నెలవారీ టెస్ట్‌లు, ఇతరత్రా పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థులకు టీసీలు ఇచ్చేస్తామంటూ బెంబేలెత్తిస్తున్నాయి. ఇప్పటికే నాలుగు నెలలు ముగిశాయని మరో పాఠశాలకు వెళ్లలేరని, కొత్త ప్రతిపాదన తెరపైకి తెస్తున్నాయి. మా పాఠశాలలోనే చదువుకోవచ్చని, అయితే నేరుగా పరీక్షలు కాకుండా ప్రైవేట్ క్యాండిడేట్ లాగా రాసుకోవాలని సూచిస్తున్నారు. ఈ విధానం ఏమారుమూల గ్రామాలకే పరిమితం కాలేదు. బెంగళూరు మహానగరంలోనూ కొనసాగుతోంది. విద్యాశాఖ మంత్రితోపాటు ఆశాఖ ఉన్నతాధికారులు గడిపే బెంగళూరులోనే ఇలా ఉంటే.. జిల్లాలు, తాలూకా కేంద్రాలలోని ప్రైవేట్ పాఠశాలలు ఏ విధంగా కొనసాగుతున్నాయి, ఏ విధంగా ఇబ్బంది పెడుతున్నాయనేది తెలుసుకోవచ్చు. వందశాతం ఉత్తీర్ణతలో రాజీకారాదని ప్రైవేట్ విద్యాసంస్థలు ఒక నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. 2025 ఏప్రిల్‌లో జరిగే ఎస్‌ఎస్‌ఎల్‌సీ పరీక్షల్లో విద్యార్థులకు ప్రైవేట్ అభ్యర్థులుగాను, సప్లిమెంటరీగా నమోదు చేసుకునేలా ఇటీవల ప్రైవేట్ విద్యాసంస్థలు రూపొందించిన సర్క్యులర్ వైరల్ అయ్యింది.

● ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల ఏదైనా విద్యార్థులందరూ ఒకే విధంగా చదువుకోరు. కొందరు 90శాతానికి పైగా మార్కులు సాధించేవారు ఉంటారు. మరికొందరు యావరేజ్ తరహాలో కొనసాగుతారు. కొంతమంది టెస్టులనుంచే వెనుకబడుతూ ఉంటారు. వీరు ఏ పరీక్షల్లోనూ ఉత్తీర్ణులు కావడం సాధ్యం కాదని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం గుర్తిస్తోంది. అటువంటి వారి తల్లిదండ్రులను పిలిపించి టీసీలు ఇస్తామంటూ బెదరింపులకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. మీ పిల్లలు సరిగా చదవడం లేదని, ఈ ప్రభావం ఇతరులపైనా పడుతుందని, కొన్నేళ్లకాలంగా రికార్డుస్థాయిలో ఫలితాలు సాధిస్తూ వచ్చిన సంస్థకు చెడ్డపేరు అని మెలిక పెడుతున్నారు. తల్లిదండ్రులు విద్యార్థులు లబోదిబోమంటే కొత్త ప్రతిపాదనలు తీసుకొస్తున్నారు. చెల్లించిన ఫీజుకు ఇక్కడే చదువుకోవచ్చని, అయితే ప్రైవేట్‌గా పరీక్షలు రాయాల్సి ఉంటుందని మెలిక పెడుతున్నారు.

విద్యాసంస్థల వైఫల్యం: సాధారణంగా విద్యార్థులు అకడమిక్‌లో వెనుకడితే వారికోసం ప్రత్యేక తరగతులు కొనసాగించాల్సి ఉంటుంది. వారిపట్ల ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుంది. మెంటార్ విధానంతో ప్రతి ఉపాధ్యాయుడికి కొంతమంది విద్యార్థులను కేటాయించి వారిలో చదువుకునే సామర్థ్యం పెంచేలా ప్రోత్సహించాలి. పదో తరగతిలో విద్యార్థి వెనుకబడితే అందుకు సంబంధిత పాఠశాల యాజమాన్యమే కారణంగా భావించాలి. ఏ సబ్జెక్ట్‌లో వెనుకబడ్డాడు, ఎంత కాలం నుంచి విద్యార్థి సక్రమంగా అర్థం చేసుకోలేకపోతున్నాడో అనేటువంటి అంశాలను గుర్తించాలి. ఉదయం, సాయంత్రం అదనంగా కొన్ని గంటలపాటు పాఠశాలలోనే స్పెషల్ క్లాస్‌లు కొనసాగించాలి. అలాంటి విధానాలు పాటించాల్సి ఉంటుంది. కానీ వెనుకబడిన విద్యార్థులను టార్గెట్ చేసుకుని రెగ్యులర్‌కు బదులు ప్రైవేట్ అభ్యర్థులుగా పరీక్షలకు కట్టించే ప్రక్రియ విద్యాహక్కు ఉల్లంఘన కూడా కానుంది. ఏటా పలు ప్రైవేట్ పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించామని గ్యారెంటీ పాస్ అయ్యారని భారీగా బోర్డులు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నాయి. అడ్మిషన్‌ల సమయంలో ఇదే ఫలితాలను చూపి విద్యార్థులను చేర్చుకుంటారు. కానీ దశాబ్దాల కాలంగా ఏ ప్రైవేట్ విద్యాసంస్థ కూడా మా పాఠశాలలో గత ఏడాది ఇంతమంది ఫెయిల్ అయ్యారని ఎక్కడా పొందుపరిచిన దాఖలాలు లేవు.

విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి: విద్యార్థుల జీవితంతో చెలగాటం ఆడే నిర్ణయాలను తీసుకుని రెగ్యులర్ స్టూడెంట్‌లు వెనుకబడ్డారని ప్రైవేట్‌గా పరీక్షలకు కూర్చోబెట్టేలాంటి చర్యలు సమంజసంకాదని సంబంధిత విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యానిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

గత ఏడాది మూడుసార్లు పరీక్షలు: గత విద్యాసంవత్సరం 2023-24లో రాష్ట్రంలో ఎస్‌ఎస్‌ఎల్‌సీ పరీక్షలు వినూత్నంగా నిర్వహించారు. సాధారణంగా రెగ్యులర్ పరీక్షల తర్వాత ఒకసారి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కానీ ఈ ఏడాది సప్లిమెంటరీ పరీక్షలు రెండుసార్లు నిర్వహించారు. సాధారణ పరీక్షల్లో 6 లక్షలమందికిపైగా ఉత్తీర్ణులు కాగా రెండు సప్లిమెంటరీలలోనూ సుమారు 75వేలమంది దాకా పాస్ అయ్యారు.

వచ్చే ఏడాది ఉత్తీర్ణత మరింత కష్టమే: కొవిడ్ కాలం నుంచి ఎస్‌ఎస్‌ఎల్‌సీ విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలుపుతూ వచ్చారు. ఈ ఏడాది జరిగిన పరీక్షల్లోనూ అమలు చేశారు. పరీక్షలు ముగిశాక సీఎం సిద్దరామయ్య విద్యాశాఖ అధికారులతో జరిపిన సమీక్షలో గ్రేస్‌మార్కులపై అభ్యంతరం తెలిపారు. వచ్చే ఏడాది నుంచి గ్రేస్‌మార్కులు ఇవ్వరాదని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే విద్యాశాఖ అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఆదేశించింది. వెనుకబడిన విద్యార్థులను ప్రైవేట్‌గా కట్టించాలనే విద్యాసంస్థలు ప్రయత్నిస్తున్న తరుణంలోనే ప్రభుత్వం గ్రేస్‌మార్కులను రద్దు చేయడం మరింత జటిలమే కానుంది. ఏ విద్యాసంస్థ అయినా రెగ్యులర్ విద్యార్థులను ప్రైవేట్‌గా కట్టుకోవాలని సూచిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప వెల్లడించారు.



హాసనాంబ అమ్మవారి మూలవిరాట్టు

నేటి నుంచి హాసనాంబ దర్శనం

● 11 రోజులు తెరుచుకోనున్న ఆలయం

బెంగళూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఏడాదికోసారి మాత్రమే తెరిచే హాసనాంబ దర్శనం కోసం వచ్చే భక్తులకు జిల్లా యంత్రాంగం భారీగా ఏర్పాట్లు చేస్తోంది. 24 నుంచి నవంబరు 3వరకు హాసన్‌లో జాతర జరగనుంది. 11 రోజులపాటు ఆలయం తెరిచి ఉన్నా కేవలం 9 రోజులు మాత్రమే భక్తులకు దర్శించుకునేందుకు వీలుంటుంది. తొలిరోజు, చివరిరోజు భక్తుల సందర్శనకు వీలుండదు. ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథ స్వామీజీ, సిద్ధగంగ మఠాధిపతి సిద్ధలింగస్వామిజీ సమక్షంలో ఆలయాన్ని గురువారం మధ్యాహ్నం 12 గంటలకు తెరుస్తామని జిల్లా ఇన్‌చార్జ్‌మంత్రి రాజణ్ణ తెలిపారు. హాసనాంబ దర్శించుకునే వేళలోనే సిద్దేశ్వర జాతర ఏటా నిర్వహించే సంప్రదాయం. భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. లడ్డూ ప్రసాదాన్ని ఇస్కాన్ సంస్థ సమకూర్చనుంది. 9 రోజులపాటు దర్శనం కోసం కనీసం 20లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేశారు. జిల్లా యంత్రాంగం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తోంది. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ, హాసన్ నగర పాలక సంస్థలతోపాటు మరిన్ని ప్రభుత్వ కార్యాలయాలు సౌకర్యాలు కల్పించడంలో నిమగ్నమయ్యాయి. ఈ ఏడాది 24 గంటలపాటు అమ్మవారిని దర్శించుకునేలా అవకాశం కల్పించారు. క్యూలో వేచివున్న భక్తులకు నీడ ఉండేలా జర్మన్ టెంట్‌లు, బారికేడ్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలతోపాటు నగరంలోని ప్రధాన రోడ్లు, కూడళ్లలో విద్యుద్దీపాలంకరణ చేపడుతున్నారు. లాల్‌బాగ్‌కు చెందిన నిపుణుల సహకారంతో ఆలయాన్ని ప్రత్యేకంగా పూల అలంకరణ చేపట్టనున్నారు.

భక్తులకు ఆధునిక సౌకర్యాలు: అమ్మవారి దర్శన సమాచారం కోసం ప్రత్యేకయాప్‌ను రూపొందించారు. సోషల్‌మీడియా యూట్యూబ్, ఫేస్‌బుక్‌ల ద్వారా ప్రచారం చేయదలిచారు. 80 మొబైల్ టాయ్‌లెట్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి వంద మీటర్లకు ఒక పర్యవేక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

పారాగ్లైడింగ్ అవకాశం: భువనహళ్ళి ఎయిర్‌పోర్ట్‌లో పారాగ్లైడింగ్, పారా మోటరింగ్, హాట్ ఎయిర్ బెలూన్ అవకాశం కల్పించారు. నగరంలోని దీపాలంకరణను తిలకించేందుకోసం డబుల్ డెక్కర్ బస్సులు ఏర్పాటు చేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

ప్రత్యేక టిక్కెట్‌లు: భక్తులకోసం ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేస్తున్నారు. సాధారణ దర్శనం, రూ.300 టిక్కెట్, వెయ్యి రూపాయల టిక్కెట్‌లను ఏర్పాటు చేశారు. రూ.60కు రెండు లడ్డూలు, ప్రసాదం ప్యాకెట్ ఇవ్వదలిచారు. రూ.300 టిక్కెట్‌కు దర్శనంతోపాటు ఒక లడ్డూను, వెయ్యి రూపాయల టిక్కెట్‌కు దర్శనంతోపాటు రెండు లడ్డూలను ఉచితంగా ఇవ్వనున్నారు.

కూలిన భవనం

● ఆరు మృతదేహాల వెలికితీత

● 14 మంది సురక్షితం



బాబుసాపాళ్యలో కొనసాగుతున్న సహాయక చర్యలు

బెంగళూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని బాబుసాపాళ్యలో నిర్మాణదశలోని భవనం కూలిన ప్రమాదంలో మృతుల సంఖ్య పెరుగుతోంది. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపకశాఖ అధికారులు నిరంతరాయంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ప్రమాదంలో బుధవారం నాటికి ఆరుగురి మృతదేహాలను వెలికితీశారు. మరో రెండు మృతదేహాలను గుర్తించినట్టు సమాచారం. పోలీసులు తెలిపిన మేరకు హర్మన్ (26), త్రిపాల్ (35), మహ్మద్ సాహిల్ (19), సత్యరాజ్ (25)తోపాటు శంకర్‌లను గుర్తించారు. మరొకరి పేరు తెలియాల్సి ఉంది. ప్రమాదం జరిగినప్పుడు 21మంది భవనంలో పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. వీరిలో బీహార్, ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లాలకు చెందిన కూలీలు ఉన్నారు. భవన నిర్మాణాలకు నాలుగు అంతస్తులకు మాత్రమే అనుమతులు పొంది 6 అంతస్థులు నిర్మిస్తున్నారు. నిర్మాణాలు నాసిరకంగా ఉండడమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. భవన యజమాని మునిరాజరెడ్డి కుమారుడు భువన్‌రెడ్డి, కంట్రాక్టర్ మునియప్పలను అరెస్టు చేశారు. పలువురికోసం గాలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. బీబీఎంపీ, రేరా చట్టాల కింద బీఎన్‌ఎస్ నిబంధనలకు అనుగుణంగా కేసులు నమోదు చేశారు. కూలిన భవన శిథిలాలను తొలగించే ప్రక్రియ కొనసాగుతోంది.

ముంపులోనే నగరం..!

● నేడూ పాఠశాలలకు సెలవు

బెంగళూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో నీట మునిగిన ప్రాంతాలలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మరోవైపు బుధవారం సాయంత్రం నగరమంతటా వర్షం కురిసింది. యలహంక పరిధిలోని కేంద్రీయవిహార్ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో కొనసాగుతున్న సహాయక చర్యలను డీసీఎం డీకే శివకుమార్ పరిశీలించారు. అయితే 20 ఫ్లాట్‌లకు చెందినవారు అపార్ట్‌మెంట్‌లను వీడేది లేదని మరో ప్రాంతానికి వెళ్లి ఎక్కడ జీవనం సాగించాలని అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్రీయ విహార్‌లో 603 ఫ్లాట్‌లు ఉండగా 95శాతం మంది ఇతర ప్రాంతాలకు వెళ్లినట్టు బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ ప్రకటించారు. ఈ ప్రాంతంలో నిల్వ ఉన్న నీటిని మళ్లించే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. వారం రోజులపాటు సమీపంలోని హోటళ్లలో బస చేసేందుకు తగిన సౌకర్యాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఇళ్లకు తాళాలు వేసుకుని రావాలని సూచించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా 20 కుటుంబాలకు చెందిన వారిని తరలించేందుకు చర్చలు జరిగాయి. ఓ నివాసి మాట్లాడుతూ 25 ఏళ్లుగా ఇక్కడే ఉన్నానని మరోచోటుకు వెళ్లలేనన్నారు. మరోవైపు సహకారనగర్‌లోని లోతట్టు ప్రాంతాలలో వరదనీటిని తోడేసే ప్రక్రియ కొనసాగుతోంది. బెంగళూరు దక్షిణ విభాగం యలచేనహళ్ళి రామకృష్ణనగర్, పయాజాబాద్‌లలో వంద ఇళ్లలోకి మురుగు నీరు చేరింది. జలమండలి మరమ్మతులు చేపట్టకపోవడంతో మురుగునీరు ఇళ్లలోకి వచ్చినట్టు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి నీరు ఇళ్లలోకి చేరినట్టు తెలిపారు. సర్జాపుర, కోరమంగలతోపాటు నగరంలోని వివిధ ప్రాంతాలలో సహాయక చర్యలు ముమ్మరం చేశారు. కాగా బాబుసాపాళ్యలో కూలిన భవన ప్రాంతాన్ని డీసీఎం డీకే శివకుమార్ సందర్శించారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతుంటే బీబీఎంపీ అధికారులు ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. భవన యజమానితోపాటు కంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నేడు కూడా పాఠశాలలకు సెలవు: నగరంలో మరో రెండు రోజులు వర్షం కురిసే అవకాశం ఉందనే వాతావరణశాఖ హెచ్చరికలతో గురువారం కూడా పాఠశాలలకు సెలవు ప్రకటించారు.



కేంద్రీయవిహార్ అపార్ట్‌మెంట్‌లలో పరిస్థితి ఇంకా ఇలానే...




నెట్టికల్లప్ప సర్కిల్‌లో కూలిన భారీ వృక్షం



అపార్ట్‌మెంట్ల పరిస్థితిపై డీసీఎం ఆరా

కాలిద్దరూ విద్యావంతులు... సన్యాసులుగా మారదలిచారు..!

● దావణగెరెలో భారీ ఊరేగింపుతో సంబరం



మానసి కుమారి, ముముక్షా భక్తికుమారి

బెంగళూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ డిగ్రీ పూర్తి చేసిన యువతులు. ఈ వయస్సులో సాధారణంగా ఉద్యోగం లేదా పెళ్లి గురించి ఆలోచిస్తారు. కానీ భిన్నంగా సన్యాసులు కాదలిచారు. దావణగెరెలో మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 26 ఏళ్ల మానసి కుమారి, ముముక్షా భక్తికుమారిలను ఊరేగించారు. సన్యాసం స్వీకరించేందుకు ముందు జరిగే ప్రత్యేక కార్యక్రమాలు మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. మానసి కుమారి మాస్టర్ ఆఫ్ సైకాలజీ చదివారు. గోకాక్‌కు చెందిన ముముక్షా భక్తికుమారి బీఏ ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు. ఇందుకు సంబంధించి రెండు కుటుంబాలకు చెందిన బంధుమిత్రులతోపాటు దావణగెరె బెళగావి ప్రాంతంలో నివసించే జైన మతస్థులు దీక్షా ఊరేగింపులో పాల్గొన్నారు. వీరు నవంబరు 17న జార్ఖండ్‌లోని రుజుబాలికా ప్రదేశంలో సన్యాసం స్వీకరించనున్నట్టు వారి కుటుంబీకులు తెలిపారు. దావణగెరెలో ఇప్పటివరకు సన్యాసత్వం స్వీకరించినవారు 64 మంది అయ్యారు.





పండమేరులో పెద్ద పెద్ద చేపలు కొట్టుకొచ్చాయి. అనంతపురం నగర శివారులు పారే నీటిలో పలువురు వలలు వేసి వాటిని పట్టుకున్నారు. ప్రమాదాన్ని పసిగట్టిన చేపలు.. అమాంతం గాలిలోకి ఎగిరి.. వల నుంచి ఆవలకు దూకి తప్పించుకుపోయాయి. దొరికిన వాటిని దొరికినట్లే కొందరు అక్కడే కాల్చుకుతిన్నారు. మరికొందరు కిలో రూ.100 ప్రకారం అక్కడే విక్రయించారు. కనగానపల్లి చెరువు తెగిపోవడంతో అక్కడి చేపలు వరద నీటిలో కొట్టుకువచ్చాయి.

- అనంతపురం రూరల్, ఆంధ్రజ్యోతి





నంజుకుతిన్నారు!



పెరటికోళ్ల పెంపకం పేరుతో బురిడీ

డ్వాక్రా సంఘాల నుంచి రూ.2.5 కోట్లు వసూలు

వైసీపీ ప్రభుత్వంలో అధికారుల నిర్వాకం

పెరటి కోళ్ల పెంపకం పేరుతో డ్వాక్రా మహిళల నుంచి సేకరించిన రూ.2.5కోట్లు డీఆర్‌డీఏ-వెలుగు అధికారులు కొందరు స్వాహా చేశారు. పెరటికోళ్ల పెంపకం పథకం స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థికంగా భారమైనా అధికారులకు మాత్రం కాసుల వర్షం కురిపించింది. రూ.వెయ్యి విలువ చేసే 11కోడి పిల్లలను ఓ యూనిట్‌గా పంపిణీ చేసి, రూ.4వేలు వసూలు చేయడంపై మహిళా సంఘాలు అప్పట్లోనే తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. కాంట్రాక్టర్‌కు లబ్ధి కలిగించడానికే బలవంతంగా మహిళలకు కోళ్ల పెంప కం యూనిట్లు అంటగడుతున్నారని, ఇందులో అధికారులు ముడుపుల కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారనే ఆరోపణలు అశాఖలోనే వినిపించా యి. వద్దంటున్నా వినకుండా ఉమ్మడి జిల్లాలో పెరటికోళ్ల పెంపకం పేరుతో పొదుపు సంఘాల మహిళలపై రూ.2.5 కోట్ల ఆర్థిక భారం మోపారు.

- అనంతపురం క్లాక్‌టవర్/ఆంధ్రజ్యోతి



ఇవే పెరటి కోళ్లు

ప్రతి మండలంలో వంద యూనిట్ల పంపిణీకి కుట్ర

పెరటికోళ్ల పెంపకం పేరుతో ఉమ్మడి జిల్లాలో 2022-23 సంవత్సరంలో మండలానికి వంద యూనిట్లు చొప్పున 6300యూనిట్లు తీసుకువచ్చారు. ఒక్కో యూనిట్ ధర రూ.4వేలుగా నిర్ణయించారు. ఇందులో మొత్తం 11కోళ్లు ఎంపికైన మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. 8 పెట్ట కోళ్లు, మూడు పుంజులను ఒక యూనిట్‌గా నిర్ణయించి పంపిణీ చేశారు. అయితే 11 కోళ్లు బహిరంగ మార్కెట్‌లో రూ.1000కు మించి ఉండవని అప్పటి లబ్ధిదారులు పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి మరింత తక్కువ ధరకు యూనిట్లు ఇవ్వాల్సిన నేపథ్యంలో రెట్టింపు ధరను వసూళు చేయడంతో మహిళా సంఘాల సభ్యులు తిరస్కరించారు.



నాసిరకం పెరటి కోళ్లు

యూనిట్లు పంపిణీ చేయాలని తీవ్ర ఒత్తిడి

పెరటికోళ్ల పెంపకం యూనిట్లు లబ్ధిదారులకు అందజేయకపోయినా, ఇచ్చిన టార్గెట్లు పూర్తి చేయకపోయినా సంబంధిత సిబ్బందిపై ఉన్నతాధికారులు తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు అప్పట్లో ఆశాఖలో గట్టిగానే వినిపించింది. ఈక్రమంలోనే ఆసక్తి లేకపోయిన కూడా బలవంతంగా మహిళలకు పెరటికోళ్ల పెంపకం యూనిట్లు తగలగట్టారు. కోడి పిల్లలు చనిపోతే డబ్బులు తిరిగి ఇస్తామని అధికారులే ప్రకటించారు. అయితే ఇచ్చిన కోడిపిల్లల్లో 90శాతానికి పైగా చనిపోయాయని అధికారులే చెప్పారు. కానీ ఒక్క సంఘానికి కూడా తిరిగి డబ్బులు ఇవ్వలేదు. మరి కోట్లాది రూపాయల సొమ్ము ఎక్కడికి వెళ్లిందనేది సందేహమే. కోళ్ల పెంపకం యూనిట్లు ఇస్తామని ఉమ్మడి జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల నుంచి రూ.2.5కోట్లు డబ్బులు వసూలు చేశారు.

అదంతా బోగస్సే

వైసీపీ ప్రభుత్వంలో పెరటికోళ్ల పేరుతో మహిళా సంఘాల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేశారు. ఒక్కో సంఘం నుంచి యూనిట్‌కు రూ.4వేలు వసూలు చేశారు. అయితే ఇచ్చిన కోడిపిల్లలన్నీ చనిపోయాయి. దీంతో రూ.4వేలు ఆయా సంఘాలకు వృథా అయ్యాయి. అధికారులు మాత్రం డబ్బులు తీసుకుని ఎంజాయ్ చేశారు. చనిపోయిన కోడి పిల్లలకు డబ్బులు వెనక్కు ఇస్తామని చెప్పారు. అయితే ఇప్పటి వరకు ఆ డబ్బులు తిరిగి ఇవ్వలేదు. కోట్లాది రూపాయల డబ్బులు ఎవరు తిన్నట్లు?



- రామసుబ్బులు, జిల్లా సమాఖ్య మాజీ సభ్యురాలు

పూర్తిగా తెలుసుకోవాల్సి ఉంది

పెరటికోళ్ల పథకం అమలుపై అప్పట్లో ఏమి జరిగిందో తెలుసుకోవాల్సి ఉంది. అప్పట్లో గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యుల జీవనోపాధుల పెంపు, పౌష్టికాహారం అందజేయడమే లక్ష్యంగా పెరటికోళ్ల పెంపకం యూనిట్ల పథకాన్ని ప్రభుత్వం తెచ్చింది. ఇందులో ఎంపిక చేసిన మహిళ సంఘాల సభ్యులకు యూనిట్లు అందజేశారు. అయితే ఉమ్మడి జిల్లాలో చేపట్టిన పథకం అమలు తీరు, డబ్బుల వసూళ్లపై పూర్తిగా మాకు తెలియదు. అప్పట్లో ఉన్న అధికారులే ఈ పథకాన్ని చేపట్టారు. బాధితులు ఎవరైన ఉంటే నిధులు ఎలా రికవరీ చేయాలి. ఎవరి నుంచి చేయాలనే అంశాలపై పరిశీలిస్తాం.



- ఈశ్వరయ్య, డీఆర్‌డీఏ-వెలుగు పీడీ

విద్యార్థులను మోసం చేసిన జగన్

■ ఏఐఎస్ఎఫ్ నాయకుల మండిపాటు



ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కళాశాలల ఫీజులను తామే చెల్లిస్తున్నామని గొప్పలు చెప్పిన జగన్మోహన్‌రెడ్డి ఉత్తిత్తి బటన్‌లు నొక్కి విద్యార్థులను మోసం చేశాడని ఏఐఎస్ఎఫ్ నాయకులు మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజుల బకాయిలపై బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెన్నార్‌భవన్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరాయుడు, కుళ్లాయిస్వామి మాట్లాడుతూ ఉన్నత విద్యాకోర్సులు అభ్యసించే విద్యార్థులకు ఫీజులు చెల్లించడం ప్రభుత్వ బాధ్యతన్నారు. వారికి విద్యాదీవెన, వసతి దీవెన పేరుతో జగన్‌రెడ్డి ఆయన జేబులోనుంచి ఇస్తున్నట్లు తెగప్రచారం చేసుకున్నారని మండిపడ్డారు. డిగ్రీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ వంటి కోర్సులు అభ్యసించిన విద్యార్థులకు ఐదేళ్లలో రూ.3500కోట్లు రాష్ట్ర వ్యాప్తంగా బకాయిపెట్టి సీఎంగా దిపోయారన్నారు. ఫీజుమొత్తాన్ని ఒకేసారి చెల్లించాల్సి ఉన్నా, నాలుగుసార్లు ఉత్తిత్తి బటన్‌లు నొక్కి మభ్యపెట్టారని మండిపడ్డారు. విద్యార్థులు ఫీజులు కట్టనిదే కళాశాలల యాజమాన్యాలు పరీక్షలు పెట్టమని, సర్టిఫికెట్లు ఇవ్వమని తెగేసి చెబుతున్నాయని వాపోయారు. కూటమి ప్రభుత్వం గత బకాయిలతోపాటు ఈ విద్యాసంవత్సరం మొత్తం ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సాంఘిక సంక్షేమశాఖ డీడీకి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మంజునాథ్, ఉమామహేష్, వంశీ, హరికృష్ణ, నాని, మన్సూర్, ప్రేమ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మృతి చెందిన అట్టే వెంకటరమణ, పేట నాగేశ్వర్‌రెడ్డి (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రైతుల దుర్మరణం

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన టిప్పర్

శింగనమల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతురాజు కాల్వ కూతలేరు బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సోదనపల్లి గ్రామానికి చెందిన రైతులు పేట నాగేశ్వర్‌రెడ్డి(55) అట్టే వెంకట రమణ(52) మృతి చెందారు. శింగనమల పోలీసులు తెలిపిన మేరకు.. సోదనపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ, నాగేశ్వర్‌రెడ్డి మంచి స్నేహి తులు. వెంకటరమణ వేరుశనగ పంటను బుధవారం తొలగించాడు కాయల శాంపిల్‌ను తీసుకుని, స్నేహితుడైన నాగేశ్వర్‌రెడ్డితో కలిసి నాయనపల్లిక్రాస్‌లో ఉండే వేరుశనగ వ్యాపారి దగ్గరికి ద్విచక్రవాహనంపై సాయంత్రం బయల్దేరారు. పోతురాజుకాల్వ కూతలేరు బ్రిడ్జి వద్దకు రాగానే అనంతపురం నుంచి తాడిపత్రి వైపు వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టింది. దీంతో రైతులు వెంకటరమణ, నాగేశ్వర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు వెంకటరమణకు భార్య కుమారుడు, కుమార్తె నాగేశ్వర్‌రెడ్డికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ శరత్ చంద్ర పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాలను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

విషాదఛాయలు

ఇద్దరు రైతుల మృతితో సోదనపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలువుకున్నాయి. గ్రామంలో ఏ వ్యవసాయ పనుల్లోనైనా సరే నాగేశ్వరరెడ్డి, వెంకటరమణ ముందుండేవారు. గతంలో ఇద్దరు డ్రిప్పు కంపెనీలో పని చేస్తూ, వ్యవసాయ పనుల్లో కూడా చురుగ్గా ఉండేవారు. రైతులకు అవసరమైన సలహాలు ఇస్తూ చేదోడువాదోడుగా ఉండేవారు. ఇద్దరు రోడ్డు ప్రమాదం మృతి చెందడంతో సంఘటన స్థలానికి గ్రామస్థులు తరలివెళ్లారు. మృతుల కుటుంబసభ్యులు, బంధువుల రోదనలతో ఆ ప్రాంతం దద్దరల్లింది.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

తండ్రిని చంపిన తనయుడు

యాడికి, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యతో కన్న కొడుకే తండ్రిని చంపిన సంఘటన బుధవారం యాడికిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు వీరన్నపల్లి గ్రామానికి చెందిన వరలక్ష్మీనారాయణ(50) యాడికిలోని వెంగమనాయుడుకాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈయనకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య వరలక్ష్మి, కుమారుడు కార్తీక్. కాగా రెండో భార్య రమాదేవికి ఒక కుమారుడు ఉన్నారు. లక్ష్మీనారాయణ ఇద్దరు భార్యలకు దూరంగా ఉంటున్నాడు. ఈయన పేరుతో 5.5ఎకరాల పొలం ఉంది. ఈ పొలం విషయంలో మొదటి భార్య వరలక్ష్మి, కుమారుడు కార్తీక్‌తో గొడవలు ఉన్నాయి. గతంలో వరలక్ష్మి, కార్తీక్‌లపై లక్ష్మీనారాయణ దాడి కూడా చేశాడు. పొలం విషయమై వరలక్ష్మి, కార్తీక్‌లు కోర్టుకు వెళ్లి 3.5ఎకరాలు వారికి చెందేలా ఆర్డర్ తెచ్చుకున్నారు. ఆ తర్వాత కూడా గొడవలు ఆగలేదు. కోర్టు ఉత్తర్వుల మేరకు భూమి దక్కినా తండ్రి జోక్యం చేసుకోవడాన్ని కార్తీక్ జీర్ణించుకోలేకపోయాడు. ఈక్రమంలోనే బుధవారం మధ్యాహ్నం యాడికిలోని కుంటవీధిలో ఒంటరిగా వెళుతున్న లక్ష్మీనారాయణపై కార్తీక్ రాళ్లతో దాడి చేసి హతమార్చాడు. అటు వైపు వెళుతున్న వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా ప్రదేశానికి చేరుకున్న సీఐ ఈరన్న, సిబ్బంది హత్యపై విచారణ చేపట్టారు. తండ్రిని హత్య చేసిన కార్తీక్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. మృతుడి రెండో భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. లక్ష్మీనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రికి తరలించారు.



పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన కార్తీక్

హత్య చేసి.. నిర్భయంగా..

తండ్రిని చంపిన అనంతరం కార్తీక్ నిర్భయంగా పోలీస్‌స్టేషన్‌కు బయల్దేరాడు. దారి మధ్యలో రక్తపు మరకలు గమనించినవారు ప్రశ్నించగా కుంటలో ఒక మనిషిని చంపినా పోలీస్టేషన్ వద్దకు పోతున్నా అంటూ సమాధానం ఇచ్చినట్లు చర్చ జరుగుతోంది. పోలీస్‌స్టేషన్‌లో తండ్రి పేరు చెప్పడానికి కూడా కార్తీక్ ఇష్టపడలేదంటే అతడు తండ్రిపై ఎంతగా ద్వేషం పెంచుకున్నాడో అర్థం చేసుకోవచ్చు.

తస్మాత్ జాగ్రత్త !

సబ్‌యూనిట్ ఆఫీసర్లకు అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్



మాట్లాడుతున్న సత్యనారాయణ

అనంతపురం టౌన్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ జిల్లా మలేరియా ఆఫీసర్ సత్యనారాయణ ఆదేశించారు. జిల్లా కార్యాలయంలో సబ్‌యూనిట్ ఆఫీసర్లతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. వర్షాలు కురుస్తుండటంతో చెత్తచెదారం నిల్వ ఉంటే అక్కడ దోమలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈదోమల వల్ల వివిధరకాల జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటివ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. అందుకే వర్ష ప్రభావిత ప్రాంతాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు చెప్పట్టాలన్నారు. ఈవిషయంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ల పాత్రచాలా కీలకమన్నారు. సిబ్బందితో పాటు ఇతరశాఖల అధికారులను సమన్వయం చేసుకొని పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహించినట్లు తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ ఆఫీసర్లు, మలేరియా విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 190 చెరువుల్లోకి నీరు

పొంగి పొర్లుతున్న 63చెరువులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలోని చెరువులకు జలకళ వచ్చింది. జిల్లా వ్యాప్తంగా 301 చెరువులు ఉండగా....ఇందులో 190 చెరువుల్లోకి వర్షం నీరు చే రింది. 63చెరువులు పొంగిపొర్లుతున్నాయి. 17చెరువులు 75శాతం, 35చెరువులు 50శాతం, 75చెరువుల్లో 25శాతం నీటితో ఉన్నాయి. రాయదుర్గం మండలంలో 15చెరువులు, బొమ్మనహాళ్ 2, డి.హీరేహాళ్ 4, కణేకల్లు 5, గుమ్మఘట్ట 13మొత్తం 39చెరువులు వర్షం నీటితో నిండాయి. రాప్తాడు నియోజకవర్గంలో అనంతపురం రూరల్ 5 చెరువులు, ఆత్మకూరు 9, రాప్తాడు 15చెరువుల్లోకి మొత్తం 29చెరువుల్లోకి నీరు చేరింది. గుత్తి 23, గుంతకల్లు 7, పామిడి 10చెరువుల్లోకి నీరు వచ్చింది. వజ్రకరూరు 8, విడపనకల్లు 2, ఉరవకొండ 8, కూడేరు 6, బెళుగుప్ప 8చెరువులు నీటితో నిండాయి. కుందుర్పి 1, శెట్టూరు 4, కంబదూరు 4, కళ్యాణదుర్గం 5, బ్రహ్మసముద్రం 12 మొత్తం 26చెరువులకు జలకళ వచ్చింది. పెద్దవడుగూరు 5, తాడిపత్రి 4, యాడికి 4 మొత్తంగా 13చెరువులకు నీరు చేరింది. శింగనమల 2, గార్లదిన్నె 1, పుట్లూరు 1, బుక్కరాయసముద్రం 1, నార్పల 3, యల్లనూరు 1 చెరువు వర్షం నీటితో ఉన్నాయి. జిల్లా వ్యాప్తం గా 190చెరువుల్లో 0.765టీఎంసీల నీరు నిల్వ ఉంది.



నిండుకుండలా బండమీదపల్లి చెరువు

26న చర్చావేదిక

అనంతపురం కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా సాగునీటి వనరుల పరిస్థితులపై ఈనెల 26న ఉదయం 10 గంటలకు స్థానిక ఎన్జీఓ హోంలో చర్చావేదిక నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు సీపీఎం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా సీపీఎం బృందం బస్సుయాత్ర చేపట్టిందని తెలిపారు. యాత్రలో బృందం దృష్టికి వచ్చిన అంశాలపై మీడియా ప్రతినిధులు, జిల్లా అభివృద్ధిని కాంక్షించే ముఖ్యులతో చర్చిస్తామన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా ప్రజాప్రతినిధులకు నివేదిక ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

వెబ్‌సైట్‌లో జాబితా

- డీఎంహెచ్‌ఓ

అనంతపురం టౌన్, అక్టోబరు(ఆంధ్రజ్యోతి): గ్రేడు-3 ఏఎన్ఎంల ఉద్యోగోన్నతుల సీనియార్టీ జాబితా వైద్యశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీ.దేవి బుధవారం ఓప్రకటనలో తెలిపారు. ఈసీనియార్టీ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల26 లోగా ఆధారాలతో జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఆతర్వాత వచ్చే ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకోమని స్పష్టం చేశారు. అనంతరం సీనియార్టీ జాబితా ప్రకారం గ్రేడు-3 ఏఎన్ఎంలకు ప్రమోషన్లు ఇస్తామని తెలిపారు.



గుత్తిలో వర్షానికి పడిసిముద్దయిన వేరుశనగక కట్టె

ఎప్పట్లానే..!

రైతును ముంచిన వేరుశనగ


● దిగుబడి రావడం కష్టమే



ఈ ఏడాది ఖరీఫ్‌లో వానలు బాగా వస్తాయన్న ఆశతో ఐదు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. విత్తనం నుంచి పంట సాగు సాగు కోసం రూ.3లక్షల దాకా పెట్టుబడి పెట్టా. పంట సాగు చేసిన తర్వాత ఊడలు దిగే సమయం, పిందె ఊరే సమయంలో వానలు పడలేదు. దాంతో పంట దిగుబడి రాలేదు. పంట దిగుబడి లేకపోవడంతో మరింత అప్పుల పాలయ్యా. ప్రభుత్వం పంటనష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

- అనిల్ కూమార్, రైతు, పెద్ద మట్లగొంది, శింగనమల మండలం

అనంతపురం అర్బన్/శింగనమల అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎప్పట్లానే ఈ ఏడాది కూడా వేరుశనగ రైతుకు నష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంట వర్షాభావంతో దెబ్బతింది. పంట కీలక సమయం పూత దశ, ఊడలు దిగే దశ, పిందెలు ఊరే సమయాల్లో వర్షం రాకపోవడంతో వేరుశనగ పంట దిగుబడి పూర్తిగా తగ్గింది. సెప్టెంబరు మాసంలో వేరుశనగ పంట ఊడలు దిగే సమయానికి ముందు వర్షం వచ్చి ఉంటే మంచి దిగుబడులు వచ్చేవని రైతులు చెబుతున్నారు. దిగుబడి లేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే పంటను దున్నేశారు. మరి కొన్ని చోట్ల అరకొర దిగుబడి రాగా, పంట కోత కోసిన తర్వాత వచ్చిన భారీ వర్షాలకు అది కూడా పాడైపోయింది. వర్షానికి తడిసిన వేరుశనగ కట్టె పశుగ్రాసానికి కూడా పనికిరాకుండా కుళ్లిపోయింది. కనీసం పెట్టుబడులు, కూలీలు ఖర్చులు కూడా రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తొలగించిన వేరుశనగ పంట

మొత్తం లొట్టలే

మాకున్న మూడెకరాల భూమితో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ పంట సాగు చేశాం. పంట సాగు కోసం కోసం రూ.4లక్షలకుపైగా పెట్టుబడి వచ్చింది. వానలు సరిగా రాకపోవడంతో దిగుబడి రాలేదు. చెట్టుకు నాలుగైదు కాయలే ఉన్నాయి. అవి కూడా ఎక్కువ శాతం లొట్టలే. త్వరలోనే పంట కోత కోయాలి. ఎకరాకు 1 బస్తా నుంచి 2 బస్తాలు దిగుబడి కూడా వస్తుందో..? రాదో తెలియడం లేదు. ఈ సారి అప్పులు చేసి పంట వేశాం. అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.



- కళావతి, కౌలు రైతు, చిన్న మట్లగొంది, శింగనమల మండలం

ఎకరాకు 3 నుంచి 5 బస్తాలే దిగుబడి

పెట్టుబడి కూడా దక్కని దుస్థితి

ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

అరకొర దిగుబడి

ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 7.9 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇందులో 1.11 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగైంది. ఇందులో ఇప్పటి దాకా 30 శాతం పంట కోత పూర్తయ్యింది. వచ్చే నెల రెండో వారానికి పంట కోతలు మొత్తం పూర్తికానున్నాయి. వేరుశనగ పంట సాగు కోసం ఎకరాకు రూ.30వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. పంట కీలక దశల్లో వర్షం పడి ఉంటే ఎకరాకు 15 నుంచి 20 బస్తాల వరకు దిగుబడి వచ్చేది. అయితే వర్షాభావం వల్ల ఎకరాకు 3 నుంచి 5 బస్తాల (ఒక బస్తా 42 కేజీలు) వరకు దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు. పలు ప్రాంతాల్లో చెట్టుకు నాలుగైదు కాయలే ఉన్నాయి. జిల్లాలో వేరుశనగ పంట కోతల ప్రయోగాలు కొనసాగుతున్నాయి. తాజాగా వర్షాలు రావడంతో పంట కోత ప్రయోగాలు నిలిపివేశారు. వర్షం ఆగిపోగానే తిరిగి పంట కోత ప్రయోగాలు కొనసాగనున్నాయి.



ఆరబోసిన వేరుశనగ కాయలు

● వ్యాపారులు కొనడం లేదు

నేను 4 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. ఎకరాకు 3 బస్తాల చొప్పున దిగుబడి వచ్చింది. వర్షం పడక ముందే పంట కోత కోసి పొలంలోనే ఉంచుకున్నా. వేరుశనగ కాయల నాణ్యంగా (ఔటన్) లేవని వ్యాపారులు ఎవరూ పంటను కొనేందుకు రావడం లేదు. వేరుశనగ కాయలు అమ్మితే కనీసం కూలీల ఖర్చులు కూడా వస్తాయో రావో అనుమానమే. పెట్టుబడుల కోసం రూ.3 లక్షలు ఖర్చు చేశా. అప్పులు చేసి పంట పెట్టా. అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు. ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు పంటను కొనుగోలు చేయాలి.



- ఆదినారాయణ, రైతు, చిన్న మట్లగొంది, శింగనమల మండలం

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఆర్‌కే లక్ష్మణ్ (జయంతి)



'పద్మ విభూషణ్' పురస్కార గ్రహీత ఆర్‌కే లక్ష్మణ్‌గా ప్రసిద్ధులైన రాశిపురం కృష్ణస్వామి అయ్యర్ లక్ష్మణ్ 1921 అక్టోబరు 24న మైసూరులో జన్మించారు. వ్యంగ్యచిత్రకారులలో ఒకరు. ఆయన సృష్టించిన 'కామన్ మ్యాన్' పాత్ర కార్టూన్‌ల చరిత్రలో అత్యంత పేరొందింది. ఆయన కార్టూన్‌లు ప్రముఖ పత్రికలలో ప్రచురితమయ్యాయి. మైసూరు యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్, కర్ణాటక రాజ్యోత్సవ పురస్కారం, జర్నలిజం సేవలకు రామన్ మెగసెసె పురస్కారం అందుకున్నారు. 2015 జనవరి 26న కన్నుమూశారు.

మన్నా డే (వర్ధంతి)



ప్రముఖ నేపథ్యగాయకుడు 1919 మే 1న కోల్కత్తాలో జన్మించారు. భారత సినీ రంగంలోనే అత్యంత ప్రతిభావంతుడైన గాయకుడిగా పేరొందారు. 1950 నుంచి 1970 వరకు హిందీ సినీరంగంలో 3,500 కుపైగా పాటలు పాడారు. 1942లో 'తమన్నా' సినిమాతో నేపథ్యగాయకుడిగా మారారు. సచిన్‌దేవ్ బర్మన్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేశారు. షోలే, మేరా నామ్ జోకర్, బర్సాత్‌కీ ఏక్ రాత్, సఫర్, సాఖీ తదితర సినిమాల పాటలకు ఎంతో గుర్తింపు వచ్చింది. 2007లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించారు. పద్మశ్రీ, పద్మభూషణ్ తదితర పురస్కారాలు అందుకున్నారు. 2013 అక్టోబరు 24న కన్నుమూశారు.

విలియమ్ మార్క్ టల్లీ (పుట్టినరోజు)



సర్ విలియమ్ మార్క్ టల్లీ 1935 అక్టోబరు 24న జన్మించారు. బ్రిటీష్ వ్యాపారవేత్త కుమారుడైన ఆయన బాల్యం ఇండియాలో గడిచింది. బీబీసీ న్యూఢిల్లీ బ్యూరో చీఫ్‌గా 20సంవత్సరాలు వ్యవహరించారు. 9 పుస్తకాలు రచించారు. పద్మశ్రీ, పద్మభూషణ్ వంటి ఉన్నత పురస్కారాలు అందుకున్నారు. 1985లో ఆర్డర్ ఆఫ్ ది బ్రిటీష్ ఎంపైర్ గౌరవహోదా పొందారు.

ఈ కార్యాలయాలకు మోక్షమెన్నడో?

- వర్షం వస్తే వెళ్లలేని దుస్థితి

ఏళ్లు గడుస్తున్న పాత తహసీల్దార్ కార్యాలయంలోనే..

- ఇబ్బంది పడుతున్న ప్రజలు



బురదనీటిలో కార్యాలయాలకు వెళ్లాలిలా...

బళ్లారి సిటీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని పాత తాలూకా కార్యాలయ ఆవరణలో 11 ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయని, ఇక్కడికి వచ్చే పోయే ప్రజలకు ఇబ్బంది కలుగుతోందని సామాజిక కార్యకర్త మేకల ఈశ్వర్‌రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజాసంబంధాలు, వ్యవసాయం, ఉద్యానవన, ఉపాధి వినిమయ కార్యాలయం, మతపరమైన దేవదాయ శాఖ, గ్రామీణ బ్రూస్‌పేట పోలీస్ స్టేషన్ తదితర పాత తాలూకా కార్యాలయంలో నిర్వహిస్తున్నారన్నారు. అన్ని కార్యాలయాలకు నిత్యం వేలాది మంది, ప్రధానంగా రైతులు వస్తుండటంతో వర్షం వస్తే వచ్చేందుకు కష్టంగా మారిందన్నారు. ఇన్ని కార్యాలయాలు ఉన్న ప్రాంగణంలో ఏ ఉన్నతాధికారి ఈ వ్యవస్థను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లలేదన్నారు. ఒక సామాజిక కార్యకర్తగా వారికి తాగునీరు, ముఖ్యంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయమని సిటీ ఎమ్మెల్యేకు, జిల్లాధికారి కార్యాలయానికి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు.

ప్రాణం తీసిన వాటర్ హీటర్



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



శ్రీవల్లి(ఫైల్)

బడికి వెళ్లే సమయమౌతోంది. త్వరగా తయారవ్వాలని బాత్ రూంలోకి వెళ్లింది చిన్నారి శ్రీవల్లి. బకెట్ నీటిలో అప్పటికే హీటర్ ఆన్‌చేసి పెట్టారు. పొరపాటున ఆ చిన్నారి హీటర్‌ను పట్టుకుంది. విద్యుదాఘాతానికి గురై సొమ్మసిల్లి పడిపోయింది. ఆ శబ్దానికి అప్రమత్తమైన కుటుంబ సభ్యులు.. వెంటనే వెళ్లి చూశారు. కదలికలు లేని చిన్నారిని ఆత్రంగా ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పాప మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషాద ఘటన కనగానపల్లి మండలం చంద్రాచర్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పసల నరసింహులు, నాగలీల దంపతులకు ముగ్గురు పిల్లలు. పెద్ద కూతురు శ్రీవల్లి(9) గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. అనుకోని ప్రమాదం పసి బిడ్డ ప్రాణాలను తీయడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. గ్రామంలో విషాదం అలుముకుంది.

- కనగానపల్లి, ఆంధ్రజ్యోతి

చిత్రావతి డ్యామ్‌కు జలకళ

» పొంగి పొర్లుతున్న జలాశయం - రేపు వాయనం సమర్పణ

బాగేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా కురుస్తున్న వరుస వర్షాలతో బాగేపల్లి పట్టణానికి తాగునీరు అందించే చిత్రావతి జలాశయం పొంగిపొర్లుతుండడంతో ప్రజలలో హర్షం వ్యక్తం అవుతోంది. పరగోడు సమీపంలోని చిత్రావతి జలాశయం గత ఏడాది వర్షం కొరతతో నిండలేదు. పట్టణానికి తాగునీరు అందించే ఉద్దేశ్యంతో నిర్మించిన చిత్రావతి జలాశయం 0.7 టీఎంసీల సామర్థ్యంగా ఉంది. ప్రారంభంలో బాగానే ఉన్నా కొంతకాలానికి పూడిక పెరిగిపోవడంతో నీటి సేకరణ సామర్థ్యం తగ్గింది. సుదీర్ఘకాలం తర్వాత డ్యామ్ నిండి పొంగి ప్రవహిస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం డ్యామ్‌కు పురసభ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి వాయనం సమర్పించనున్నారని పురసభ ముఖ్య అధికారి శ్రీనివాస్ తెలిపారు.



చిత్రావతి డ్యామ్ ఇలా...

కర్ణాటక జీడీపీ దేశంలోనే అధికం

» సీఎంఓ ప్రకటన

బెంగళూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కర్ణాటక జీడీపీ దేశంలోనే అధికం కావడం సంతోషమని ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. 2023-24లో జీడీపీ ప్రగతి 10.2శాతంగా నమోదైంది. నేషనల్ స్టాటిస్టిక్స్ కమిషన్ (ఎన్ఎస్‌సి) అంచనాలకంటే 6.2శాతం ఎక్కువ ప్రగతి సాధ్యమైనట్టు ప్రకటించారు. ఎన్ఎస్‌సి గణాంకాల ప్రకారం జీడీపీ 8.2శాతం కాగా జీడీపీలో కర్ణాటక రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. గత ఏడాది రాష్ట్రంలో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయి. విశ్వవ్యాప్తంగా ఐటీ మార్కెట్ వెనుకబడింది. కర్ణాటకలో ఉత్తమ ఆర్థిక ప్రగతి సాధించినట్టు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వివరించారు. 2023-24 ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో కర్ణాటక జీడీపీ 4శాతంగా అంచనా వేశారు. రాష్ట్రంలో కరువు కారణంగా వ్యవసాయ రంగంలో అనుకున్నంత ప్రగతి సాధ్యం కాలేదు. అయితే ఐటీ, హార్డ్‌వేర్ రంగంలో 28శాతం ప్రగతి సాధ్యమైంది. ప్రపంచమంతటా ఐటీ సెక్టార్‌లో ఆర్థిక సంవత్సరంలో కొంతమేర వెనుకబడినా కర్ణాటకలో మాత్రం ప్రగతి సాధ్యమైంతి. భారత ఐటీ రంగం 2022లో ఆర్థిక సంవత్సరంలో 15.5 శాతం ఉండేది. 2023లో 8శాతానికి తగ్గింది. కానీ రాష్ట్రంలో మాత్రం జీడీపీ ఆశాజనకంకు ఉత్తమ పాలన, భిన్నమైన రంగాలలో అభివృద్ధి కారణమని ప్రకటించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎన్ఎస్‌సి కర్ణాటకకు 9.4 జీడీపీ ప్రగతిని అంచనా వేసింది. ఇది జాతీయస్థాయిలో సరాసరి 10.5శాతం కంటే కొంచెం తక్కువగా ఉంది. కానీ ఆర్థికమంత్రిత్వ విభాగం కర్ణాటక జీడీపీని 14శాతంగా అంచనా వేశారు. 2024 సెప్టెంబరులో కర్ణాటక ఏడాది నుంచి ఏడాదికి జీఎస్టీ వసూళ్లలో 10శాతం, రిజిస్ట్రేషన్‌లలో 24శాతం పెరిగింది. ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలతోపాటు ప్రజా సంక్షేమాలకు తగిన ప్రతిఫలం దక్కిందని సీఎంఓ ప్రకటించింది.

అర్చకులకు సహకారం అందిస్తాం

శిడ్లఘట్ట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సుకోసం నిరంతరం దైవారాధనలో ఉండే ఆలయ అర్చకుల సంక్షేమానికి తమవంతు సహకారం అందిస్తామని పౌర, ఆహార సరఫరాలశాఖ మంత్రి మునియప్ప తెలిపారు. తాలూకాలోని మేలూరు గ్రామంలోని గంగమ్మ ఆలయం సహా పలు ఆలయాలను మంగళవారం సందర్శించారు. ఉమామహేశ్వర ఆలయంలో విశేషపూజల అనంతరం ప్రభుత్వ మాదిరి పాఠశాలను చేరుకుని తమ బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే రవికుమార్ తాలూకాలో వంద పడకల ఆసుపత్రి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనం, దుస్థితిలో ఉన్న రోడ్ల అభివృద్ధికి, మేలూరులోని ప్రభుత్వ మాదిరి పాఠశాల అభివృద్ధికి సహకారం అందించాలని మంత్రికి విన్నవించారు. ఈ మేరకు మంత్రి స్పందిస్తూ వారం రోజుల్లోగా సమస్యలపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రితోనూ, సంబంధిత శాఖలతో మంత్రితో చర్చించి దశలవారీగా తాలూకా అభివృద్ధికి సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా మేలూరు గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు ఆర్‌ఏ ఉమేశ్, ఆర్‌కే రామకృష్ణప్ప, కంబదహళ్ళి జగదీశ్, అశ్వత్థప్ప తదితరులు పాల్గొన్నారు.



మంత్రి మునియప్పకు సన్మానం

గుంతల రోడ్డును బాగు చేయండి



స్వాభిమాన బళగ ఆధ్వర్యంలో నిరసన

మహదేవపుర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వర్తూరు, హలసహళ్ళి రోడ్డు నుంచి సర్జాపురకు వెళ్లే మార్గం గుంతలమయంగా మారింది. ఈ నేపథ్యంలో రోడ్డును బాగు చేయాలని స్వాభిమాన బళగ, స్థానికులు నిరసన తెలిపారు. స్వాభిమాన బళగ అధ్యక్షుడు కుప్పి మంజునాథ్ మాట్లాడుతూ వర్తూరు - హలసహళ్ళి డీన్స్ స్కూల్, ఫౌండేషన్ స్కూల్‌కు, సర్జాపురకు వెళ్లే మార్గం అధ్వానంగా మారిందన్నారు. కొన్ని చోట్ల మోకాలిలోతు గుంతలు ఉన్నాయని సంచారానికి తీవ్ర అంతరాయం నెలకొందన్నారు. సామాన్యులు వెళ్లేందుకు జంకుతుంటే ఇక దివ్యాంగులు ఈ మార్గంలో ఎలా రాకపోకలు సాగించాలని ప్రశ్నించారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో బురదమయం కాగా మరోవైపు తారురోడ్డు పూర్తిగా దెబ్బతిందన్నారు. తరుచూ వాహనచోదకులు ప్రమాదాలకు లోనవుతున్నారనని వాపోయారు. వెంటనే రాకపోకలకు వీలుగా రోడ్డును బాగు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నాణ్యత పాటించాలన్నారు. నిరసనలో స్థానికులు, స్వాభిమాని సంఘం సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

తాలూకాలో వేరుశనగ పంట నష్టం

» ఆదుకోవాలని అన్నదాతల ఆవేదన

బాగేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బాగేపల్లి తాలూకాలో వరుస వర్షాలతో వేరుశనగ పంటకు తీవ్రంగా నష్టపోయింది. సాధారణంగా నవంబరు, డిసెంబరు నెలల్లో పంట చేతికి వస్తుంది. అతివృష్టి, అనావృష్టితో తరచూ పంటను అన్నదాతలు నష్టపోతున్నానంరు. తాలూకాలోని బిల్లూరు నలసానంపల్లికి చెందిన బీవీ వెంకటరవణ ప్రధానంగా వేరశనగ పంట సాగు చేశాడు. ఈసారి సాధారణం కంటే ఎక్కువ వర్షం కురిసినా అతివృష్టి కావడంతో అన్నదాతల్లో తృప్తి లేక పోయింది. 5 ఎకరాల్లో వేరుశనగ పంట వేయగా దాదాపు కోత దశలో ఉండగా భారీ వర్షాలతో నష్టపోయినట్టు వాపోయారు. నష్టపోయిన పంటకు పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇదే మాదిరి పలువురు రైతులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.



పంటను చూపుతున్న రైతు

శస్త్ర చికిత్సలపై ప్రత్యేక సదస్సు



సదస్సులో పాల్గొన్న వైద్యులు తదితరులు

బెంగళూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ల్యాప్రోస్కోపిక్ హెర్నియా శస్త్ర చికిత్సలపై ప్రత్యేక సదస్సు కావేరి ఆసుపత్రిలో జరిగింది. హెర్నియా సొసైటీ ఆఫ్ ఇండియా హెర్నియా సర్జరీలో ఎక్సలెన్స్ సెంటర్‌కు గుర్తింపు లభించినట్టు కావేరి ఆసుపత్రుల ఎండీ విజయభాస్కరన్ తెలిపారు. ల్యాప్రోస్కోపిక్ హెర్నియా సర్జరీపై జరిగిన ట్రైనింగ్‌కు దేశ విదేశాలనుంచి నిపుణులు భాగస్వామ్యులయ్యారన్నారు. వారు తమ సాధనలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారన్నారు. హెర్నియా సొసైటీ ఆఫ్ ఇండియా చైర్మన్ డాక్టర్ విజయ్ బోర్‌గావ్కర్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలు ముఖ్యమన్నారు. శస్త్ర చికిత్సలలో నిపుణుల అనుభవాలను ముఖ్యంగా యువవైద్యులు తీసుకోవాలన్నారు. డాక్టర్ గణేశ్ షెణైతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఇల్లు కూలి వీధినపడ్డ కుటుంబం

దొమ్మసంద్ర, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళి దొమ్మసంద్ర గ్రామానికి చెందిన యోగేంద్ర ఇల్లు వరుస వర్షాలతో దెబ్బతిని కూలింది. మట్టిగోడలు, పెంకులతో నిర్మించిన ఇల్లు కూలిపోయింది. భారీ వర్షంతో పలు చోట్ల ఆస్తులకు నష్టం వాటిల్లిన రీతిలో యోగేంద్ర ఇల్లు సోమవారం ఒక్కసారిగా కూలడంతో కుటుంబం వీధిపాలైనట్లుగా మారింది. పవర్‌లూమ్స్‌లో పనిచేసే జీవనం సాగిస్తున్న వీరికి ఇల్లు కూలిపోవడమేకాక వర్షానికి నిత్యావసరాలు అన్నీ దెబ్బతిన్నాయి. ఇల్లు కూలే సందర్భంలో లోపల ఎవరూ లేకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. యోగేంద్ర తమ్ముడు జగదీశ్, సోదరి వేదవతి, అత్త శాంతమ్మలు ఇంట్లో ఉంటున్నారు. తమను అన్నివిధాలా ఆదుకోవాలని యోగేంద్ర కుటుంబం ప్రభుత్వాన్ని కోరుతోంది.



కూలిన ఇంటి వద్ద యోగేంద్ర

తెగుళ్లతో అన్నదాత కుదేలు..!

కంప్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో వరి రైతు తెగుళ్ల బాధతో పూర్తిగా నష్టపోయారు. ఈ యేడాది పుష్కలంగా పంటలు పండాయనుకునేలోపు అధిక వర్షాలు పడి పంటలకు ఉల్లికోడు, అగ్గితెగులు, ఎండు తెగులు సోకడంతో చేతికొచ్చిన పంటకు మొలకలు వచ్చాయి. దీంతో రైతులు లక్షల్లో నష్టపోయారు. నారాయణస్వామి క్యాంపు రైతు అచ్యుతరాయవర్మ మాట్లాడుతూ ఎకరాకు రూ.15వేలు కౌలు వెచ్చించి 60 ఎకరాలు మన్నూరుసూగూరు వద్ద వరి పంట చేశానని, కొంత వరకు మొదటలో వేసుకున్న పంటలు ఎలాంటి తెగుళ్లు సోకకుండా దిగుబడి వచ్చింది. కానీ వెనుక వేసుకున్న రైతులు నదికి నీరు రావడం, వర్షాలు అధికంగా రావడం, తెగుళ్లతో పూర్తిగా పంటలు నష్టపోయామని అన్నారు. ఎకరాకు ఇప్పటికే రూ.35 వేలు పెట్టుబడి పెట్టామని రూ.50 వేలు వరకు ఖర్చు అవుతుందన్నారు. దిగుబడి కూడా 50 క్వింటాళ్లు రావాల్సిందని, వర్షాలతో తెగుళ్లు సోకి కేవలం ఎకరాకు 15 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చిందన్నారు. ఈసారి పంటలకు ఎన్నిసార్లు రసాయనిక మందులు పిచికారి చేసినా తెగుళ్లు వచ్చాయన్నారు. పూర్తిగా నష్టపోయామని ప్రభుత్వాలు కౌలు రైతులను ఆదుకోవాలన్నారు.



తేమ ఎక్కువై ఎండ తెగులు సోకిన వరి పంట



మొలకలు వచ్చిన వంకి

ఎయిర్‌పోర్ట్‌లో రూ.87వేలు మోసం

» లాంజ్‌లో ప్రవేశించే ప్రయత్నం

క్రైం కార్నర్

బెంగళూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసాలకు అంతు లేకుండా పోతోంది. బెంగళూరు కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో లాంజ్‌లో ప్రవేశించే వేళ ఓ మహిళ రూ.87వేలు మోసపోయారు. బెంగళూరుకు చెందిన భార్గవిమణి అనే మహిళ తెలిపిన మేరకు వివరాలిలా. విమాన ప్రయాణం కోసం ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లగా లాంజ్‌లోకి ప్రవేశించేవేళ క్రెడిట్‌కార్డు లేకపోవడంతో అందుకు సంబంధించిన ఫోటోను సిబ్బందికి చూపగా లాంజ్ సిబ్బంది ఓ మొబైల్‌యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారన్నారు. భద్రతా దృష్ట్యా అదే యాప్ ద్వారా ఆమె ముఖాన్ని స్కాన్ చేసుకోవాలని సూచించారన్నారు. ఆ తర్వాత వ్యక్తిగత వివరాలు సేకరించి బ్యాంకు ఖాతా నుంచి రూ.87వేల నగదు కాజేశారని భార్గవిమణి వాపోయారు. అయితే ఎయిర్‌పోర్ట్ సిబ్బంది అభిప్రాయం ప్రకారం ఆమె లాంజ్ పాస్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని ఆ తర్వాత లాంజ్‌కు రాకుండా స్టార్‌బక్స్‌కు వెళ్లి కాఫీ కొనుగోలు చేశారని, తర్వాత ఏం జరిగిందో తెలియదన్నారు. తొలుత నెట్‌వర్క్ ప్రాబ్లెంగా భావించామని అయితే ఆమె ఫోన్‌ను ఎవరో ఉపయోగిస్తున్నట్టు తెలిసిందన్నారు. ఆమె బ్యాంకు ఖాతాలను పరిశీలించుకుంటే రూ.87వేల నగదు డ్రా అయినట్టు గుర్తించామన్నారు. ఆమె క్రెడిట్‌కార్డులోని సొమ్మును ఫోన్‌పే ఖాతాకు బదిలీ చేసుకున్నారన్నారు. భార్గవిమణి సోషల్‌మీడియాలో ఓ పోస్ట్ చేయడంతో ఎయిర్‌పోర్ట్ సిబ్బంది స్పందించి ఆమెను సంప్రదించారు. ఈ మోసాన్ని సైబర్ క్రైం విభాగానికి ఫిర్యాదు చేస్తామని భరోసా ఇచ్చారు. బ్యాంకు ఖాతాను ఫ్రీజ్ చేయించారు.

తమ్ముడి హత్య కేసులో అన్న అరెస్టు



నిందితుడు మణికంఠ

దొమ్మసంద్ర, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సమాజంలో కుటుంబీకుల అనుబంధాలు రాను రాను తగ్గిపోతున్నాయి. ఆనేకల్ తాలూకా సర్జాపుర పోలీస్ స్టేషన్ పరిధిలో తమ్ముడిని అన్న హతమార్చిన ఘటన చోటు చేసుకుంది. పండిత అగ్రహారంలో ఉంటున్న తమిళనాడుకు చెందిన ఆనంద్ (27)ను అన్న మణికంఠ హతమార్చారు. తాపీ పనిచేసేవీరు సోమవారం రాత్రి ఇంట్లో తగవు చోటు చేసుకోగా అన్న మణికంఠ ఒక్కసారిగా దండుకట్టెతో తమ్ముడిని బాది హతమార్చాడు. సమాచారం అందుకున్న సర్జాపుర పోలీసు ఘటనాస్థలాన్ని కేసు నమోదు చేసుకున్నారు. నిందితుడు మణికంఠ (32)ను అరెస్టు చేశారు.

ఉబెర్ ఆటో ఏడాదిలో మరింత విస్తరణ

బెంగళూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉబెర్ ఆటో అండ్ మోటో ఈ ఏడాదిలో సేవలు మరింత విస్తరణ చేయదలిచినట్టు ప్రకటించారు. బుధవారం బెంగళూరులో సంస్థ దక్షిణ ఏసియా అధ్యక్షుడు ప్రభజిత్‌సింగ్ మీడియాతో మాట్లాడారు. 2024లో 36 వేల కోట్ల రూపాయల ఆర్థిక లావాదేవీలు లక్ష్యంగా కలిగామన్నారు. ఉబెర్‌తో రైడ్‌లు, బెంగళూరులో రైడర్‌లకోసం 80వేల కోట్ల రూపాయలు కన్సూమర్ సర్‌ప్లస్ సాధ్యమైందన్నారు. ఢిల్లీ తర్వాత బెంగళూరులో సేవలు బాగున్నాయని మరింత విస్తరణ చేయదలిచామన్నారు. 2013లో ఉబెర్ సేవలు ఆరంభమయ్యాయన్నారు. ఇటీవల తక్కువదూరం ప్రయాణించేవారు ద్విచక్రవాహనాల్లో ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. వినియోగదారులు, రైడర్‌లకు అనుకూలంగా సేవలందిస్తున్నామన్నారు. మహిళల సురక్షితకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

గ్రీన్ మొబిలిటీకి టాటా ప్రాధాన్యం

బెంగళూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రీన్ మొబిలిటీకి మరింత ప్రాధాన్యత ఇవ్వదలిచినట్టు టాటా మోటార్స్ ట్రక్స్ వైస్ ప్రెసిడెంట్ రాజేశ్‌కౌర్ అభిప్రాయపడ్డారు. క్లీన్ గ్రీన్ ఫ్యూయెల్ లాజిస్టిక్స్ సంస్థ డైరెక్టర్ మిలిన్ డోంగాతో ఒప్పందం చేసుకున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం బెంగళూరులో టాటా మోటార్స్ ఒక ప్రకటన విడుదల చేశారు.

డెయిరీ భవనానికి రూ.2లక్షలు




సహకారసంఘానికి ఆర్థిక చేయూత అందజేత

శిడ్లఘట్ట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని నారాయణదాసరహళ్ళి గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం భవనం నిర్మాణానికి ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ రూ.2లక్షలు మంజూరు చేసింది. ఈమేరకు సంస్థ జిల్లా డైరెక్టర్ ప్రశాంత్ సీఎస్ మంజూరు పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ కలబురగి జిల్లా పరిధికే కాకుండా వీరేంద్రహెగ్డే రాజ్యసభ గ్రాంటును పాల డెయిరీల బలోపేతానికి కేటాయిస్తున్నారన్నారు. ఆలయాల జీర్ణోద్ధరణ, పాఠశాల భవనాలు, ఇతరత్రా పథకాల ద్వారా సమాజంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నారన్నారు. సహకారసంఘం కార్యదర్శి ఆనంద్ మాట్లాడుతూ ధర్మస్థళ సంస్థ ఆర్థిక సహకారం సంతోషంగా ఉందన్నారు. సహకార సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాల్పుల కేసులో కారు స్వాధీనం

బత్తలపల్లి, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం వద్ద ఈనెల 20వ తేదీన కలకలం రేపిన కాల్పుల ఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కాల్పులకు పాల్పడిన దుండగుల కారు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ కాల్పుల కేసును ఎస్పీ రత్న సీరియస్‌గా పరిగణించారు. నిందితులను పట్టుకునేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేశారు. ముమ్మర గాలింపు చేపట్టారు. తెలంగాణ గ్యాంగ్ ఉపయోగించిన కారును బుధవారం బత్తలపల్లి పోలీసులు కర్ణాటక రాష్ట్రం శిరిగుప్పలో స్వాధీనం చేసుకున్నారు. బత్తలపల్లికి తీసుకొచ్చారు. తెలంగాణకు చెందిన అరవింద్ తెలంగాణ గ్యాంగ్‌లో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.92	1,614.11
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,09,314	420
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,09,074	9,794
నీటి నిల్వ (టీఎంసీలు)	101.46	39.47

దీపావళిని పర్యావరణహితంగా జరుపుకోవాలి

● కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా



బళ్లారి సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పర్యావరణహితంగా జరుపుకోవాలని కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో దీపావళి పండుగ సందర్భంగా పచ్చి టపాసులు కాకుండా మరే రకమైన టపాసుల అమ్మకాల వినియోగం నిషేధించామన్నారు. పర్యావరణహిత పండుగను పురస్కరించుకుని దీపావళి రోజున ఉదయం 8 నుంచి 10గంటలకు వరకు మాత్రమే టపాసులు కాల్చాలని కలెక్టర్ సూచించారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వేదవతి



నిండుగా ప్రవహిస్తున్న వేదవతి నది

బళ్లారిరూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో వేదవతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. అనంతపురం జిల్లా గుమ్మఘట్ట సమీపంలోని బీటీపీ ప్రాజెక్టుకు అత్యధిక స్థాయిలో వర్షపునీరు చేరడంతో డ్యాం గేట్లు ఎత్తి నీటిని కిందికి వదిలారు. దీంతో రూపనగుడి, రాయాపురం, హగరి, పరమదేవనహళ్లి, చాగనూరు, మోకా తదితర ప్రాంతాల్లో నదికి ఇరువైపులా ఉన్న పంపుసెట్లతో పాటు పంట పొలాలు నీటమునిగాయి.

బెంబేలెత్తిస్తున్న ఎలుగుబంట్లు



నెల్లాపురం నుంచి కరడిధామకు వెళ్లే మార్గంలో సంచరిస్తున్న ఎలుగుబంట్లు

కంప్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): దరోజీ కరడిధామ భాగంలోని నెల్లాపురం, ఉప్పరహళ్లి, చిన్నాపురం గ్రామాల పక్కనున్న కొండల్లో ఎలుగుబంట్లు సంచరిస్తున్నాయి. రైతులు పొలాలకు వెళ్లాలన్నా భయాందోళన చెందుతున్నారు. సోమవారం నెల్లాపురం నుంచి కరడిధామకు వెళ్ల మార్గంలో రెండు ఎలుగుబంట్లు సంచరిస్తున్న దృశ్యం రైతు కంట పడింది. రైతు అక్కడి నుంచి పరుగులు తీశాడు. కొండ ప్రాంతంలో ఎలుగుబంట్లు కనిపిస్తుండటంతో ప్రజలు, రైతులు పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. అటవీశాఖ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని రైతులు కోరారు.

నేడు కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్

బళ్లారి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా సండూరు నియోజకవర్గానికి జరగనున్న ఉప ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థిగా అన్నపూర్ణ తుకారాం గురువారం నామినేషన్ వేయనున్నారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఇందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సండూరులో గురువారం 11 గంటలకు నామినేషన్లు వేయనున్నారని తెలిపారు. మంత్రులు సంతోష్ లాడ్, జమీర్ అహ్మద్, ఎమ్మెల్యేలు నారా భరత్‌రెడ్డి, గణేష్, గవియప్ప, నాగరాజుతో పాటు మేయర్ ముల్లంగి నందీష్ బాబు, వెంకటేశ్ హేగ్డే, మహ్మద్ రఫీ రానున్నారు. ఉప ఎన్నికకు అధికార పార్టీ నుంచి 20 మంది మంత్రులు, 30 మంది ఎమ్మెల్యేలు ప్రచారంలో పాల్గొననున్నారు. వీరు ఇక్కడే ఉంటూ పర్యవేక్షించనున్నారు. రాష్ట్రంలో మూడు స్థానాల్లో ఉప ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ సిద్ధరామయ్య కేబినెట్‌లోని మంత్రివర్గంలో కొందరిని బళ్లారి జిల్లా సండూరు నియోజకవర్గానికి ఇన్‌చార్జిలుగా వేయనున్నారు.



రాణి చెన్నమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మేయర్, అధికారులు



సిరుగుప్ప: నివాళి అర్పిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

రాణి చెన్నమ్మ అందరికీ ఆదర్శం

● మేయర్ నందీష్

బళ్లారి సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన వీర మహిళ కిత్తూరు రాణి చెన్నమ్మ అందరికీ స్ఫూర్తిదాయకమని నగర మేయర్ ముల్లంగి నందీష్ అన్నారు. నగరంలోని జోళదరాశి దొడ్డనగౌడ రంగ మందిరంలో బుధవారం జిల్లాపరిపాలన, పంచాయతీ, కన్నడ సాంస్కృతిక శాఖ, మహానగర కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్ర్య సమర యోధురాలు కిత్తూరు రాణి చెన్నమ్మ జయంతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహానాయకురాలు చెన్నమ్మ ఏడేళ్ల ప్రాయంలోనే గుర్రపుస్వారీ, విలువిద్య, ఖడ్గవిద్యలో నిష్ణాతురాలన్నారు. చిన్నతనంలోనే వీరత్వం, ధైర్యసాహసాలు ప్రపంచానికి చాటిచెప్పిన మహిళ అన్నారు. జిల్లా శరణసాహిత్య పరిషత్ అధ్యక్షుడు సిద్దలింగప్ప ప్రత్యేక ఉపన్యాసం చేస్తూ భారతదేశంలోనే కిత్తూరు సంస్థానమే ప్రథమంగా స్వాతంత్ర్య పోరాట గంట మోగించిందని, వీర సైనికుల రక్తంతో ఇక్కడి నేల పునీతమైందన్నారు. చెన్నమ్మ 1778 సెప్టెంబరు 14న జన్మించారన్నారు. 1824 అక్టోబరు 23న బ్రిటీష్ వారిపై పోరాడి శత్రువులను ఓడించి సంబరాలు జరుపుకున్నారని తెలిపారు. ముందుగా నగరంలోని గవియప్ప సర్కిల్ నుంచి బసవేశ్వర పుత్తలి మీదుగా కిత్తూరు రాణి చెన్నమ్మ చిత్రపటంతో జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో ఏర్పాటు చేసిన వేదిక కార్యక్రమానికి చేరుకుంది. కార్యక్రమంలో కన్నడ సాంస్కృతిక శాఖ బి.నాగరాజు, వీరశైవ లింగాయత్ పంచమసాలీ సమాజ్ అధ్యక్షుడు నీలాగౌడ,కన్నడ సాంస్కృతిక శాఖ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ కొట్రప్ప, అధ్యక్షులు రాజేశ్వరీ, నాగవేణి, బ్రూస్‌పేట పోలీస్‌స్టేషన్ పీఎస్ఐ సిందూర్, సభ్యులు సురేఖ మల్లనగౌడ, ఈరమ్మసురేంద్ర, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సిరుగుప్ప: కిత్తూరు రాణి చెన్నమ్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం పట్టణంలో తహసీల్దార్ విశ్వనాథ్ చెన్నమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ తహసీల్దార్ సత్యమ్మ, రెవెన్యూ అధికారులు, విలేజ్ అకౌంటెంట్లు, ప్రజలు పాల్గొన్నారు.

కంప్లి: బ్రిటీషర్లను ఎదుర్కొని వీరమరణం పొందిన కిత్తూరు రాణి చెన్నమ్మను ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని తహసీల్దార్ శివరాజ్ శివపుర అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆమె జయంతిని ఘనంగా నిర్వహించారు. మూకయ్యస్వామి, చంద్రశేఖర్‌గౌడ, రేణుకగౌడ, గిరి గౌడ, హేమయ్యస్వామి, మల్లేశప్ప, మృత్యుంజయ పాల్గొన్నారు.



కంప్లిలో...

ఎమ్మెల్యే భరత్ రెడ్డి జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు

● 135 అడుగులతో భారీ కటౌట్

● నగరంలో ఆరు చోట్ల భోజన సదుపాయం



135 అడుగుల భారీ కటౌట్ వద్ద పూజలు చేస్తున్న భరత్ అభిమానులు


బళ్లారి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి జన్మదిన వేడుకలకు ఆయన అభిమానులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. నగరంలోని గవియప్ప సర్కిల్(మోతీసర్కిల్) వద్ద 135 అడుగుల ఎత్తులో కటౌట్లు ఏర్పాటుకు సిద్ధం చేశారు. ప్రధానంగా 8 చోట్లు భోజన వసతులు ఏర్పాటు చేశారు. బుధవారం కటౌట్ల ఏర్పాటు వద్ద పూజలు చేశారు. రాష్ట్ర రాజకీయాలకు కేంద్రబిందువు, గడినాడు జిల్లాగా పేరు ఉన్న బళ్లారిలో ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి పుట్టిన రోజు అత్యంత ఘనంగా జరగనుండడం రాజకీయ చర్చగా మారింది. ప్రస్తుతం సండూరు ఉప ఎన్నికలు కూడా జరుగునున్నాయి. సండూరు ఉప ఎన్నికల నామినేషన్ కాంగ్రెస్ పార్టీ నుంచి నామినేషన్ దాఖలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు, ఎమ్మెల్యేలు నామినేషన్‌కు హాజరవుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే భరత్‌రెడ్డి జన్మదిన వేడుకలకు కూడా వారంతా హాజరవుతారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే నగరంలో బర్తడే ఫ్లెక్సీలు, కటౌట్లు అన్ని చోట్లా భారీగా ఏర్పాటు చేశారు.

శాంతించిన తుంగభద్ర



కంప్లి కోట వద్ద వంతెనను తాకుతూ ప్రవహిస్తున్న నీరు

కంప్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదిలో నీరు తగ్గుముఖం పట్టలేదు. జలాశయంలోకి వచ్చిన నీటిని వచ్చినట్లే నదికి వదులుతున్నారు. దీంతో కంప్లి వద్ద వంతెనను తాకుతూ నీరు ప్రవహిస్తున్నాయి. కంప్లి, గంగావతి రోడ్డు అభివృద్ధి శాఖ అధికారులు వాహనాల ప్రయాణం రద్దు చేయడంతో కంప్లి నుంచి బుక్కసాగర, కడేబాగులు మీదుగా గంగావతికి చేరుకుంటున్నాయి. నది ఉధృతంగా ప్రవహించినప్పుడల్లా ప్రజలకు, రైతులకు విద్యార్థులకు తిప్పలు తప్పండం లేదు. ఐదోసారి నదికి ఉధృతంగా రావడంతో ప్రజలకు కష్టాలు ఎదురవుతున్నాయన్నారు. అలాగే హంపిలో పురందేశ్వర మండపం వద్ద పర్యాటకులు నది వద్దకు వెళ్లకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



కోదండరామాలయంలోకి చేరిన నీరు

కొత్త నిబంధనలతో అధికారుల్లో ఆందోళన

● మూతబడిన రిజిస్ట్రేషన్ కార్యాలయాలు

● కార్యాలయాల చుట్టూ ప్రజల ప్రదక్షిణ

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలతో ఆ శాఖ అధికారుల్లో ఆందోళన మొదలైంది. అక్రమ రిజిస్ట్రేషన్‌లకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఈ-ఖాతా విధానాల అమల్లో తప్పులు జరిగితే సంబంధిత రిజిస్ట్రేషన్ అధికారులే బాధ్యత వహించడంతోపాటు శిక్ష విధించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నూతన చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రెండు రోజులుగా రాష్ట్రంలోని రిజిస్ట్రేషన్ పనిచేసే అధికారులు ఆందోళన చేపట్టారు. బళ్లారి నగరంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కూడా రిజిస్ట్రేషన్‌లు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో రెండు రోజులుగా నగరంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం బోసిపోయింది. విషయం తెలియక కార్యాలయానికి వచ్చి ప్రజలు తిరిగి గ్రామాలకు వెళ్ళలేక ఎదురుగా ఉన్న డాక్యుమెంట రైటర్ల షాపుల ముందు అధికారుల కోసం వేచి చూడల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో సెంట్రల్ రిజిస్ట్రేషన్ చట్టం 1908ను దిద్దుబాటు చేస్తూ కొత్త 2023 చట్టం రాష్ట్రపతి అనుమతి పొందగా ప్రభుత్వం అక్టోబరు 19వ తేదీన అధికారికంగా అమెండ్‌మెంటు జారీ చేసింది. ఇందులో కొత్తగా రిజిస్ట్రేషన్ చట్టంలో నకిలీ పత్రాలకు కళ్లెం వేయడం, నకిలీ దస్తావేజులు ఆధారంగా రిజిస్ట్రేషన్‌లు చేస్తే సబ్ రిజిస్ట్రార్‌కు మూడేళ్ల జైలు శిక్ష తదితర నిబంధనలు కొత్తగా చేర్చడాన్ని నిరసిస్తూ సోమవారం అధికారులు ఆందోళన చేపట్టారు. దీంతో రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లినట్లు అయింది.



మూతబడిన రిజిస్ట్రేషన్ కార్యాలయం



అధికారుల కోసం వేచిచూస్తున్న ప్రజలు

హనుమంతు గెలుపునకు శ్రమిస్తాం

● దివాకర్‌కు టిక్కెట్ రాకపోవడం బాధాకరమే

● ఆయనకు మంచి భవిష్యత్తు ఉంది ● ఎమ్మెల్యే గాలి



మాట్లాడుతున్న గాలి జనార్దన్‌రెడ్డి, బీజేపీ నాయకులు

బళ్లారి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సండూరు ఉపఎన్నికలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బంగారు హనుమంతును గెలిపించుకోవడం ప్రతి కార్యకర్త బాధ్యత అని గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి అన్నారు. దివాకర్‌కు సండూరు టికెట్ రాకపోవడం కొంత బాధగానే ఉందని, పార్టీ నిర్ణయం ప్రకారం కట్టుబడి ఉండాలని ఆయన కోరారు. బుధవారం బళ్లారిలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, దివాకర్, హనుమంతప్ప, ఐనాత్‌రెడ్డి, ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు. 2024లో జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో దివాకర్‌కు బీజేపీ టికెట్ ఇవ్వలేదని ఇచ్చి ఉంటే గెలిచేవారని అన్నారు. అయితే దివాకర్‌కు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా నియమించారని తెలిపారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఓడిపోతుందని జోష్యం చెప్పారు. వీరితో పాటు పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పారా స్విమ్మింగ్ పోటీల్లో జిల్లాకు ఏడు పతకాలు



సాధించిన పతకాలతో స్విమ్మర్ కవిత

బళ్లారి సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గోవాలోని పనాజీలో 19 నుంచి 22వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి పారా స్విమ్మింగ్ పోటీల్లో బళ్లారి జిల్లా ఏడు పతకాలు సాధించింది. 1 స్వర్ణం, 4 రజతం, 2 కాంస్య పతకాలు సాధించారు. సాయి నిఖిల్, గోపీచంద్, బేబీ సాయి, కవిత పతకాలు సాధించినవారిలో ఉన్నారు. వరికి రజని లక్క, శరత్ గైక్వాడ్‌లు శిక్షణ ఇచ్చారు. ఎమ్మెల్యేలు నాగేంద్ర, నారాభరత్‌రెడ్డి, జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, ఎస్పీ శోభరాణి, పంచాయతీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి రాహుల్ శరణప్ప, అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్, యువజన సాధికారత, క్రీడాశాఖ సహాయ సంచాలకులకులు గ్రేసి అభినందించారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి



డీసీ నితీశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

రాయచూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎస్సీ సముదాయానికి చెందిన న్యాయవాదులు ముఖ్యమంత్రిని కోరారు. బుధవారం జిల్లాధికారి నితీశ్ ద్వారా న్యాయవాదులు ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇచ్చారు. న్యాయవాదులు మాట్లాడుతూ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం అనంతరం ఎస్సీలకు సుప్రీంకోర్టులో న్యాయం జరిగిందన్నారు. అనేక ఏళ్లుగా రిజర్వేషన్ ఫలితాలను అనుభవించలేకపోతున్న ఉపకులాలకు సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయం జరిగిందన్నారు. వర్గీకరణ అమలు చేసే అధికారం రాష్ట్రాలకే ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు కావల్సిన చర్యలు వెంటనే చేపట్టాలన్నారు.

టపాసుల దుకాణానికి నోటీసు

బళ్లారి రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని పీడీ హళ్లి గ్రామ పంచాయతీలో బాలాజీ ఎంటర్‌ప్రైజెస్ టపాసుల దుకాణానికి అధికారులు నోటీసులు జారీ చేశారు. కలెక్టర్ నుంచి అనుమతులు లేకుండా టపాసులు విక్రయించరాదని అన్నారు. గ్రీన్ టపాసులు అమ్మాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. పీడీ హళ్లి గ్రామ పంచాయతీ అధికారులు బాలాజీ ఎంటర్‌ప్రైజెస్‌కు గ్రీన్ టపాసులు అమ్మాలని నోటీసులు అతికించారు.

ఘనంగా కిత్తూరు రాణి చెన్నమ్మ జయంతి



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న జడ్పీ ఉపకార్యదర్శి శశికాంత్

రాయచూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కిత్తూరురాణి చెన్నమ్మ స్వాతంత్ర్య పోరాట యోధురాలని, బ్రిటీషులను ధైర్యంగా ఎదుర్కొని స్వాతంత్ర్య సంగ్రామంలో తనవంతుగా పోరాటాన్ని సాగించారని జడ్పీ ఉపకార్యదర్శి శశికాంత్ శివపురె అన్నారు. బుధవారం నగరంలోని రంగమందిరంలో జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, నగరసభ, కన్నడ సంస్కృతిక శాఖల సంయుక్తాధ్వర్యంలో చెన్నమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు.

హోసూరు జోన్

పథకాల అమలుపై ప్రత్యేక శిబిరాలు



రైతుకు స్ప్రేయర్‌ను అందిస్తున్న కలెక్టర్ సరయు

హోసూరు(కృష్ణగిరి) అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి కృష్ణగిరి జిల్లా అంచెట్టి సర్కిల్, ఉరిగం, ఇన్నర్ సర్కిల్, మాడక్కల్ కొండ గ్రామంలో ప్రజా సంబంధాల శిబిరం జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు ఆధ్వర్యంలో ఏర్పాటైంది. బుధవారం తళి ఎమ్మెల్యే టి.రామచంద్రన్ నేతృత్వం వహించారు. శిబిరంలో రెవెన్యూ అభివృద్ధి, ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, వెనుకబడిన సంక్షేమ శాఖ ఏడీల తరఫున అమలు చేస్తున్న కార్యక్రమాలను సంబంధిత శాఖల అధికారులు నేరుగా ప్రజలకు తెలియజేశారు. ద్రావిడ సంక్షేమ శాఖ, సమగ్ర శిశు అభివృద్ధి కార్యక్రమం, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఇతరశాఖలు అమలు చేస్తున్న పథకాల గురించి అధికారులు వివరించారు. ప్రజా సంబంధాల శిబిరాన్ని ప్రతినెలా నిర్వహిస్తారు. దీని వల్ల వివిధ శాఖల అమలు చేస్తున్న పథకాల గురించి సంబంధిత శాఖ అధికారులు నేరుగా ప్రజలకు వివరిస్తారు. అంతేకాకుండా ప్రజల నుంచి వినతిపత్రాలు కూడా స్వీకరించేందుకు ముఖ్యమంత్రితో పాటు వారి వారి గ్రామాల్లో వివిధ కార్యక్రమాల శిబిరాలు నిర్వహిస్తున్నారు. అలాగే ఆడ, మగ పిల్లలైనా సరే ముందుగా ఉన్నతవిద్య వరకు చదివించాలి, ఉన్నత చదువులతో గొప్ప హోదాలు సాధ్యమని ప్రజాప్రతినిధులు, అధికారులు అభిప్రాయపడ్డారు. కావున తల్లితండ్రులు విద్యార్థులకు ఉన్నత చదువులకు పంపాలని, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు తమిళనాడు ప్రభుత్వం ముఖ్యమంత్రి అల్పాహార పథకం కింద 1 నుంచి 5వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం అందిస్తోందని, మధ్యాహ్నం భోజనం, గుడ్లు, యూనిఫారాలు, సైకిళ్లు, ఉచితంగా అందజేస్తున్నారు. ఈ సందర్భంగా హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక, పీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (సామాజిక భద్రతా పథకం) సి.పన్నీర్ సెల్వం, జిల్లా సరఫరా అధికారిణి గీతారాణి, జిల్లా ఆది ద్రావిడర్ సంక్షేమ అధికారి డి.రమేశ్‌కుమార్, దివ్యాంగుల సంక్షేమాధికారి మురుగేశన్, జిల్లా వెనుకబడిన సంక్షేమ అధికారిణి పద్మలత, ఐసీడీఎస్ అధికారి జయంతి, మాదేశ్, జిల్లా అభివృద్ధి అధికారి శ్రీనివాసమూర్తి, ఉప జిల్లా అభివృద్ధి అధికారులు మునిరాజ్, శైలజ, జిల్లా పంచాయతీ కమిటీ సభ్యులు, పళనిస్వామి, యూనియన్ కమిటీ సభ్యులు విజయకుమార్, పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షురాలు మలరమ్మ, అధికారులు పాల్గొన్నారు.

మురుగునీటిని తొలగించండి



హోసూరు బస్టాండులో నిలిచిన మురుగునీరు

హోసూరు(సిప్‌కాట్) అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): హోసూరులోని పలు ఫ్యాక్టరీలకు రాకపోకలు సాగించేవారి సంఖ్య అధికంగా ఉంటుంది. ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో కార్మికులు ఉన్నారు. ఫ్యాక్టరీలకు సమీపంలోని సరిహద్దునగల కర్ణాటక రాష్ట్రానికి వెళ్లడానికి బస్సులు హోసూరు బస్టాండుకు వచ్చి వివిధ ప్రాంతాలకు వెళ్తాయి. అలాగే హోసూరు చుట్టుప్రక్కల గ్రామస్తులు, రైతులు కూడా వివిధ పనుల నిమిత్తం హోసూరు బస్టాండుకు వస్తుంటారు. హోసూరు బస్ స్టేషన్‌కు వివిధ అవసరాల నిమిత్తం రోజూ వేలాదిమందిమందితో రద్దీగా ఉంటుంది. కానీ బస్టాండ్‌లోని మురుగుదొడ్డి నుంచి వృథాగా నీరు బస్టాండు రోడ్డుపై చేరుతోంది. దీంతో ఈ ప్రదేశం దుర్గంధం, దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీరు రోడ్డుపై నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

ఆకాశాన్నంటిన వెల్లుల్లి ధరలు

హోసూరు అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): హోసూరు మార్కెట్‌లో వెల్లుల్లి ధరలు ఆకాశాన్నంటాయి. రోజువారీ వంటలలో ఉపయోగించే వాటిలో వెల్లుల్లి ఒకటి. సాధారణంగా రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి వెల్లుల్లిని దేశవ్యాప్తంగా ఎగుమతి అవుతుంది. హోసూరు వ్యాపారులు కొనుగోలు చేసి బత్తలపల్లి కూరగాయాల మార్కెట్‌కు విక్రయిస్తారు. ఇక్కడి నుంచి హోసూరుతో పాటు బయటి జిల్లాలకు హోల్‌సేల్, రిటైలర్‌ల ద్వారా విక్రయిస్తారు, రూ.160 నుంచి రూ.200 వరకు పలికిన వెల్లుల్లి ధర గత రెండు నెలలుగా పెరిగి రూ.350 నుంచి రూ.400 వరకు విక్రయిస్తుండగా వారం నుంచి మరింతగా పెరిగిపోయింది. ప్రస్తుతం కిలో రూ. 400 నుంచి 450 పలుకుతోంది. కాగా నెంబరువన్ క్వాలిటీ వెల్లుల్లి రూ.480 నుంచి కిలో రూ.600 వరకు ఉంటోంది. సామాన్య, మధ్య తరగతి గృహిణులలో ఆందోళన నెలకొంది. స్థానికంగా పండించే వెల్లుల్లి జనవరి, ఫిబ్రవరిలో చేతికి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌కు 2 లారీల లోడ్ మాత్రమే వస్తుండడంతో డిమాండ్ అధికమై ధర ఎక్కువగా ఉన్నట్టు మార్కెట్ వర్గాలు వెల్లడించాయి.



ఆస్పత్రిని తనిఖీ చేసిన జిల్లా అధికారి

రాయచూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజీవ్‌గాంధీ సూపర్ స్పెషాలిటీ(ఒపెక్) ఆస్పత్రిని బుధవారం జిల్లాధికారి కే సతీశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం వార్డుల్లో పరిశీలించిన జిల్లాధికారి రోగులతో మాట్లాడి అక్కడ అందుతున్న వైద్యసేవల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో ఆస్పత్రిలో అందిస్తున్న సూపర్ స్పెషాలిటీ సేవలు, అందుబాటులో ఉన్న డాక్టర్ల వివరాలను ప్రత్యేక అధికారి ద్వారా తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా వైద్యసేవలందించాలని సిబ్బందిని, అధికారులను ఆదేశించారు. డీహెచ్ఓ డాక్టర్ సురేంద్ర బాబు పాల్గొన్నారు.



వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీసీ నితీశ్

పోలీసుల పేరిట ఆభరణాల అపహరణ



బాధితుడు ఆదెప్ప

రాయచూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పోలీసులుమని చెప్పి బైక్‌పై వెళుతున్న వ్యక్తిని ఆపి ఆబరణాలు అపహరించిన సంఘటన జిల్లాలోని సిరవార తాలూకా హరవి సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. రాయచూరు వైపు నుంచి హరవికి వెళుతున్న హళ్ళిహోసూరు గ్రామ వ్యక్తి ఆదెప్ప గౌడను గ్రామ సమీపంలో రోడ్డుపై ఆపిన దుండగులు నలుగురు తాము పోలీసులుమని గొంతులో ఆభరణాలు, చేతిలో ఉంగరాలు ఉండడం సరికాదని ఇటీవల దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో వాటిని తీసుపెట్టుకోవాలని సూచించారు. వాటిని తీసేందుకు ఆయన ప్రయత్నిస్తుండగానే తామే ఒక పర్సును తీసి ఇందులో ఉంచుకోవాలని సూచిస్తూ పర్సులో ఆభరణాలు పెట్టినట్లు నటించి వాటిని కాజేవారు. ఆదెప్ప ఇంటికెళ్లి చూసుకోగా అందులో ఆభరణాలు కనిపించకపోవడంతో మోసానికి గురైనట్లు గ్రహించాడు. వెంటనే పోలీస్ స్టేసన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. సిరవార పోలీసులు ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.